PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 154 | విజయవాడ, ఆదివారం 7 జనవరి 2024 | 6 + 8 పేజీలు + స్నేహ | వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 7 January 2024 | Rs



ఇక్కడే పట్టేయ్యాలి..

- నేడు ఆస్ట్రేలియా మహిళలతో రెండో టి20
- రాత్రి 7.00గం॥లకు

లోపలి పేజీలో..



ఆదిత్య ఎల్ 1 సక్సెస్!

- లాగ్రాంజ్ పాయింట్‌కు అంతరిక్ష నౌక
- రాష్ట్రపతి, ప్రధాని, సిఎం సహా పలువురు అభినందనలు

5

అంగన్‌వాడీలపై ఎస్మా

- వేతనాల్లో కోత • బెదిరేది లేదు : సంఘాలు • భగ్గుమన్న కార్మికలోకం

- వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు ఖండన

ప్రజాశక్తి - అమరావతి

అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సమస్యలను పరిష్కరించడానికి బదులుగా క్రౌర్యాన్ని చూపింది. పెరిగిన ధరలతో బతకడం కష్టంగా ఉందంటూ పదేపదే విజ్ఞప్తి చేసినా స్పందించని సర్కారు మరోమార్గం లేక సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీలను బలప్రయోగంతో అణచివేయడానికి సిద్ధమైంది. 26 రోజులుగా శాంతియుతంగా సాగుతున్న సమ్మెపై ఎస్మా (ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్టు -అత్యవసర సేవల నిర్వహణ చట్టం)ను ప్రయోగించింది. ఈ మేరకు జిఓ నెంబర్2ను శనివారం విడుదల చేసింది. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ అక్క, చెల్లెమ్మల జీతాల్లో కోతలు పెట్టడం ద్వారా ప్రభుత్వం వారి పొట్టకొట్టింది .సమ్మెకాలానికి సుమారు 3,450 రూపాయలను తగ్గించి అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల జీతాలను శనివారం వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ పరిణామం పట్ల అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలకు భయపడేది, బెదిరేది లేదని, మరింత పట్టుదలతో సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీ సంఘాలు ప్రకటించాయి. గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్న ప్రభుత్వానికి ఎస్మా ప్రయోగించే అధికారం ఎక్కడిదని ప్రశ్నించాయి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ నెంబర్ 2 ప్రతులను దగ్ధం చేశాయి. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం పట్ల కార్మికసంఘాలు భగ్గుమన్నాయి. ప్రభుత్వ చర్యను తీవ్రంగా తప్పుపట్టాయి. ప్రభుత్వ తీరు ఇదే మాదిరి కొనసాగితే మిగతా 2లో



ఎస్మా ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీ సంఘాల నాయకులు కె సుబ్బరావమ్మ, లలిత తదితరులు

ఎస్మాను ఉపసంహరించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ప్రకటన విడుదల చేశారు. తక్షణమే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలను ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేధించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుండా సమ్మె నిషేదిస్తూ, సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం దుర్మార్గమని తెలిపారు. న్యాయబద్ధమైన సమ్మెను నిరంకుశ చర్యల ద్వారా విచ్ఛిన్నం చేయాలనుకోవడం అభ్యంతరకరమన్నారు. మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తోందని విమర్శించారు. ఇదే వైఖరి కొనసాగితే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యను కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, పార్టీలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని, అంగన్‌వాడీలకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

9న జైల్ భరో

- కార్మిక సంఘాల హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం పచ్చి నియంతృత్వమని, వెంటనే ఎత్తేయకపోతే రాష్ట్ర వ్యాప్త బంద్ చేపడతామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, అనుబంధ సంఘాలు జైల్ భరో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు పోలారి, టిఎన్‌టియుసి నాయకులు ఆదిబాబు మాట్లాడారు. 7న ఎస్మా కాపీలను రాష్ట్ర వ్యాప్తంగా దగ్ధం చేయనున్నామని అన్ని పరిశ్రమలు, సంస్థల వద్ద ఎస్మా జిఓలు దగ్ధం చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే 'ఎస్మా' జిఓను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా బంద్ చేసేందుకూ వెనుకాడబోమని హెచ్చరించారు. అంగన్‌వాడీలు 26 రోజులు సమ్మె చేస్తున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. అంగన్‌వాడీలు అత్యవసర సర్వీసులని చెబుతున్న ప్రభుత్వం మరి ఇన్నాళ్లు ఎందుకు పట్టించుకోలేదని వారు ప్రశ్నించారు. పాలు, నీళ్లు, విద్యుత్ వంటివి అత్యవసర సర్వీసుల కింద వస్తాయని, కానీ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం మూర్ఖత్వమని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, కార్యదర్శి కె ధనలక్ష్మి, ముజఫర్ అహ్మద్, ఐఎఫ్‌టియు నాయకులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అలా చేరారు... ఇలా వెళ్లారు...

- వైసిపికి అంబటి రాయుడు గుడ్‌బై

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి



పార్టీలో చేరిన పది రోజులకే వైసిపికి రాజీనామా చేస్తూ ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శనివారం ఆయన సిఎం జగన్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. అంబటి రాయుడు గత నెల 28న తాడేపల్లిలో సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. రాయుడు గుంటూరు ఎంపిగా పోటీ చేస్తారని వెంటనే వార్తలు వచ్చాయి. అయితే, పార్టీ అధిష్టానం ఆయనను మచిలీపట్నం నుంచి పోటీ చేయాలని ఆదేశించింది. దీంతో, ఆయన ససేమిరా అన్నారు. రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. గత నెల 26న గుంటూరులో జరిగిన సిఎం పర్యటనకు అంబటి రాయుడు హాజరు కాలేదు. ఆడుదాం-ఆంధ్ర ప్రారంభ సభలో క్రికెట్ ఆటకు సంబంధించి క్రీడాకారులకు చేయూత ఇచ్చేందుకు అంబటిరాయుడు సేవలు వినియోగించుకుంటామని సిఎం ప్రకటించారు. అయితే, అంబటి రాయుడు ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడానికి అనారోగ్య కారణాలు ఉన్నాయని వైసిపి నాయకులు అప్పట్లో చెప్పారు. కానీ, ఆయనను కావాలని సిఎం పక్కన పెట్టారని టిడిపి ప్రచారం చేసింది. దీంతో, వెంటనే రాయుడుని తాడేపల్లికి రప్పించి సిఎం జగన్ కండువా కప్పి వైసిపిలో చేర్చుకున్నారు. అప్పటివరకు పార్టీలో చేరకుండానే పార్టీ నాయకులతో కలిసి జిల్లాలో పర్యటించారు. అనూహ్యంగా ఇప్పుడు ఆయన నిష్క్రమణ వైసిపిలో కలకలం రేపింది.

గుంటూరు నుంచి పోటీకి లావు విముఖత!

నర్సరావుపేట ఎంపి లావు కృష్ణదేవరాయులును గుంటూరు నుంచి పోటీ చేయాలని వైసిపి అధిష్టానం సూచించింది. ఇందుకు ఆయన నిరాకరించారు. తాను నర్సరావుపేటకు అనేక ప్రాజెక్టులు తెచ్చుకున్నానని, అందువల్ల తిరిగి అక్కడి నుంచే పోటీ చేస్తానని, అవకాశం ఇవ్వకపోతే తదుపరి నిర్ణయం తరువాత చెబుతానని గుంటూరులో శనివారం ఆయన మీడియాకు తెలిపారు.

అసైన్డ్ భూములకూ పరిహారం, నష్టపరిహారం చెల్లించాలి

- హైకోర్టు కీలక తీర్పు



ప్రజాశక్తి, అమరావతి

ప్రభుత్వం నుంచి అసైన్మెంట్ కింద డికెటి పట్టాలు పొంది భూములు సాగు చేసుకుంటున్న రైతులు పరిహారంతో పాటు నష్ట పరిహారానికి కూడా అర్హులేనని హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రజా అవసరాల కోసం అలాంటి భూములు తీసుకున్నప్పుడు ప్రయివేటు భూ యజమానికి చెల్లించే విధంగానే వారికి కూడా పరిహారంతో పాటు నష్ట పరిహారం కూడా చెల్లించాలని చెప్పింది. ప్రయివేటు భూముల యజమానులు ఏ విధంగా అయితే నష్ట పరిహారానికి, ఇతర ప్రయోజనాలకు అర్హులో, అసైనీలు కూడా అదే స్థాయిలో అర్హులని తేల్చి చెప్పింది. కామన్ జాయింట్ ఫార్మింగ్ స్కీం (సిజెఎఫ్ఎస్) భూములు పొందిన వారు కూడా డికెటి పట్టాదారులతో సమానంగా నష్ట పరిహారానికి అర్హులంది. అసైన్మెంట్ కింద ఇచ్చిన పట్టా తాత్కాలికం కాబట్టి ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకు అర్హులు కాదన్న ప్రభుత్వ వాదనను కొట్టివేసింది.

తెలుగు గంగ ప్రాజెక్టులో భాగమైన కండలేరు రిజర్వాయర్ వల్ల భూములు కోల్పోయిన అసైనీలకు ఇతర భూ యజమానులతో సమానంగా నష్ట పరిహారం, ఇతర ప్రయోజనాలన్నింటినీ కల్పించాలని తీర్పు చెప్పింది. ఈ మేరకు గతంలో సింగిల్ చేయించిన తీర్పును డివిజన్ బెంచి ఆమోదించింది. సింగిల్ జడ్జి తీర్పును కొట్టేయాలని కోరుతూ తెలుగు గంగ ప్రాజెక్టు భూ సేకరణ స్పెషల్ కలెక్టర్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు మిగతా 2లో

'ఉక్కు'లో ఉద్యోగుల ఏరివేత!

- 25 శాతం మంది ఉద్వాసనకు చర్యలు ప్రారంభం
- ఏళ్ల తరబడి ఖాళీల భర్తీకి బ్రేక్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు శరవేగంగా ప్రయత్నాలు జరుగుతోన్న నేపథ్యంలో వెయ్యి రోజులకుపైగా కార్మికులు, ఉద్యోగులు పోరాడుతున్నా కేంద్రంలోని మోడీ సర్కారుకు చీమకుట్టినట్టయినా లేదు. మరోవైపు ప్రయివేటీకరణ ప్రక్రియ నిలిచిపోయిందని, తాను అమిత్ షాతో ఢిల్లీలో మాట్లాడానని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రచారం పటాపంచలయ్యేలా తాజాగా ప్లాంట్‌లో పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో జిందాల్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ... వైజాగ్ స్టీల్ యాజమాన్యానికి 25 శాతం ఉద్యోగులు, కార్మికుల ఏరివేతకు జారీ చేసిన ఆదేశాలను ప్రస్తుతం ప్లాంట్ యాజమాన్యం అమలులో పెట్టింది. గతంలో బాగా పనిచేసి ప్రస్తుతం అనారోగ్యం పాలైన సుమారు 700 మంది ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసుకుని వీరందరికీ మెడికల్ టెస్టులు నిర్వహించబోతోంది. లాంగ్ లీవ్‌లు, సిక్‌లీవ్‌లు, ఇతర కారణాలతో సెలవులో ఉన్న వారిని కూడా కలుపుకుంటే మరో 750 మంది ఉన్నట్లు భోగట్టా. 2024 జనవరి నుంచి డిసెంబరులోపు 1100 మంది ఉద్యోగులు రిటైర్ కానున్నారు. ఉన్నవారిని బయటకు నెట్టే ప్రక్రియ ఒకవైపు, ఐదు వేల ఖాళీ పోస్టులను భర్తీ జరగకుండా చూడడం మరోవైపు ప్లాంట్‌లో సాగుతోంది. ఉక్కు ఫ్యాక్టరీకి ఆర్థిక భారం తగ్గించే పేరుతో ఈ తతంగం నడుపుతున్నారు. ఢిల్లీలో జిందాల్ ప్రతినిధులు, స్టీల్ యాజమాన్యం మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా పలు విషయాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. ఖాళీ పోస్టులు భర్తీ జరిగితేనే కొత్తగా యువతకు ఉద్యోగాలు సాధ్యమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరాం శనివారం 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఉద్యోగాల భర్తీ కోసం సిఐటియు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పోరాడుతోందని చెప్పారు.

బళ్లారి మోడల్‌తో కేంద్ర మంత్రిత్వ శాఖ డైరెక్షన్

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జిందాల్‌కు చెందిన బళ్లారి ప్రయివేట్ స్టీల్ ప్లాంట్‌ను అనుసరిస్తూ (మ్యాన్ పవర్ తగ్గిస్తూ) వెళ్లాలని ఢిల్లీలో జరిగిన ఒప్పందం చెబుతోందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించాలంటే, పర్మినెంట్ కార్మికులను తగ్గించి కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను పెంచి నడపాలన్నదే దీని సారాంశం. వైజాగ్ స్టీల్‌లో జిందాల్ ఎంట్రీ వెనుక కుట్ర కూడా ఇదేనని ప్రచారం జరుగుతోంది. బళ్లారి జిందాల్ స్టీల్‌లో నాలుగు వేల మంది పర్మినెంట్, ఆరు వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. 16 మిలియన్ టన్నుల ఉత్పత్తి వస్తోంది. విశాఖలో 16 వేల మంది కాంట్రాక్టు కార్మికులు, 13,500 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉన్నారు. ఇక్కడ 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగుతోందన్న పోలికలతో కేంద్ర స్టీల్ మంత్రిత్వ శాఖ వైజాగ్ స్టీల్ యాజమాన్యంపై ఒత్తిడి పెంచినట్లు సమాచారం. దీంతో, పర్మినెంట్ కార్మికులను బయటకునెట్టే చర్యలు తాజాగా ఊపందుకున్నాయి.

కష్టకాలంలోనూ రూ.1,700 కోట్ల టర్నోవర్

2023లో పది నెలల కష్టకాలంలో కూడా అంటే, ప్లాంట్‌లోని మూడు ఫర్నేస్‌ల్లో ఒకదాన్ని నిలిపేసినా రూ.1,700 కోట్లు టర్నోవర్‌ను ఉక్కు కర్మాగారం సాధించి రికార్డు నెలకొల్పింది. చలికాలమైన డిసెంబరు, జనవరిల్లో నిర్మాణ రంగం ఊపులో ఉంటుంది. 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చిల్లో ఉత్పత్తి మరో రూ.1000 కోట్లు అదనంగా స్టీల్ ఉత్పత్తి జరిగే అవకాశాలు ఉన్నాయి. రెండేళ్లుగా కేంద్రం మూసేసిన మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను స్టీల్ కార్మికుల దీర్ఘకాల ఆందోళనలతో తాజాగా పనిచేయిస్తున్నారు. అదనపు ఉత్పత్తి దీని ద్వారా సాధ్యపడనుంది. ఉద్యోగాలను తొలగించాల్సిన అవసరం రాకపోయినా కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ జిందాల్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం నడుస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పార్లమెంటులో నోరు నొక్కేస్తున్నారు

- కాంగ్రెస్ నేత ఖర్గే
- 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' లోగో ఆవిష్కరణ

లోపలి పేజీలో..

ఎంపి పదవికి, టిడిపికి రాజీనామా చేస్తా

- కేశినేని నాని

ప్రజాశక్తి - విజయవాడ



తెలుగుదేశం పార్టీకి, తన ఎంపి పదవికి రాజీనామా చేస్తామని విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ప్రకటించారు. త్వరలోనే లోక్‌సభ స్పీకర్‌ను కలిసి రాజీనామా సమర్పిస్తానని తెలిపారు. ఆ వెంటనే టిడిపికి కూడా రాజీనామా చేస్తానని చెప్పారు. ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడు మండలంలో వైసిపి నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావుతో కలిసి ఆయన శనివారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని మాట్లాడుతూ... "టిడిపికి రాజీనామా చేస్తున్నా.. లోక్‌సభ స్పీకర్ అపాయింట్‌మెంట్ కూడా కోరాను.. ఆయన అపాయింట్‌మెంట్ ఇచ్చినప్పుడు ఢిల్లీ వెళ్లి ఎంపి పదవికి.. ఆ తర్వాత టిడిపికి రాజీనామా చేస్తా" అని పేర్కొన్నారు. అనంతరం తన అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. కొందరు వ్యక్తులు తన కుటుంబాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

కనకమేడల రాయబారం

ఎంపి కేశినేనిని బుజ్జగించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు ప్రయత్నించారు. టిడిపి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్‌ను ఆయన వద్దకు పంపారు. అయితే, కేశినేని అలక వీడేందుకు నిరాకరించినట్లు తెలిసింది. "స్వయంగా అధినేత చంద్రబాబు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చెప్పిన తర్వాత రాయబారాలెందుకు? మాట్లాడేదేముంటుంది" అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. పార్టీ అధినేత చంద్రబాబు మాట్లాడతారని ఫోన్ చేసేందుకు ప్రయత్నించినా సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది.



సదస్సులో మాట్లాడుతున్న విజయరాఘవన్

ఉత్పత్తి రంగాలను దెబ్బతీస్తున్న కేంద్రం

- పోరాటాలకు సిద్ధం కండి
- రాష్ట్ర సదస్సులో సంఘం జాతీయ అధ్యక్షులు విజయ్‌రాఘవన్
- భూ పంపిణీకి మద్దతిచ్చే పార్టీలకు మద్దతు : బి.వెంకట్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో ఉత్పాదక రంగాలకు ప్రోత్సహకాలు ఇవ్వకుండా కేవలం సేవా రంగంపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోందని ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు ఎ.విజయరాఘవన్ అన్నారు. 'వ్యవసాయ రంగం సంక్షోభం, వ్యవసాయ కార్మికులపై ప్రభావం, భూ సమస్య, దాని ప్రాధాన్యత' అనే అంశంపై రాష్ట్ర సదస్సు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన గుంటూరు బ్రాడీపేట పిఎల్‌రావు భవన్‌లోని కొరటాల మీటింగ్ హాల్‌లో శనివారం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో విజయరాఘవన్ మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను ముమ్మరం చేయాలని కోరారు. ఉత్పాదక రంగాల్లో దేశం తిరోగమనంలో పయనిస్తోందని, సేవా రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధారపడుతున్నాయని, తద్వారా రాబోయే కాలంలో ఆర్థిక సంక్షోభం మరింత పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు. బిజెపి ఆర్థిక విధానాల వల్ల దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతోదన్నారు. వ్యవసాయ కార్మికులు పనుల్లేక ఆకలి చావులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఆర్థిక వృద్ధి రేటు గణనీయంగా పడిపోతుందని తెలిపారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం స్వచ్ఛమైన పరిపాలన అందిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం ఇడి అధికారులను ఉపయోగించి ఏదో విధంగా ఇబ్బంది పెట్టాలని చూస్తోందన్నారు. కమ్యూనిస్టులు అవినీతికి దూరంగా ఉంటారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిరంకుశ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని, ఆ పార్టీకి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ పేదలు, వ్యవసాయ కార్మికులకు భూములు పంపిణీ చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా మరోసారి ఉద్యమాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో 40 కోట్ల ఎకరాల సాగు భూమి ఉందని, కరోనా కష్టకాలంలో రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు కష్టపడి ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేస్తే వారికి కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత మిగతా 2లో

నేడు బంగ్లా పార్లమెంటు ఎన్నికలు

ఢాకా :ప్రపంచాధిపత్య శక్తులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఎన్నికలకు ముందే ఫలితం ఖరారైపోయింది. ఈ సారి కూడా షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీయే విజయం సాధించబోతున్నదని ఓటింగ్ జరగక ముందే చెప్పేస్తున్నారు. ప్రతిపక్ష మితవాద పార్టీ బిఎన్‌పి ఈ ఎన్నికల చట్టబద్ధతను ప్రశ్నించింది. అణచివేత, నిర్బంధాల మధ్య ఈ ఎన్నికలు ఒక ప్రహసనంగా జరగబోతున్నాయని బిఎన్‌పి నాయకులు ఆరోపించారు. ప్రతిపక్షాల ఆరోపణలపై బంగ్లాదేశ్ వ్యవసాయ మంత్రి మహ్మద్ అబ్దుర్ రజాక్ మాట్లాడుతూ, జైలులో ఉన్న బిఎన్‌పి నాయకులు స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు. ఎన్నికల సందర్భంగా హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నందునే అరెస్టు చేశామని అన్నారు. ఇదిలా వుండగా బంగ్లా ఎన్నికలపై న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఒక కథనం రాస్తూ, 10 లక్షల మంది బిఎన్‌పి కార్యకర్తలు కోర్టు కేసులను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఆదివారం నాటి ఎన్నికల కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. 42వేల పోలింగ్ కేంద్రాల్లో 11.96కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 27 రాజకీయ పార్టీలకు చెందిన 1500మందికి పైగా అభ్యర్థులు బరిలో వున్నారు.

మున్సిపల్ చర్చలు మళ్లీ విఫలం

- సమ్మె యథాతథం : కార్మిక సంఘాలు
- నేటి నుండి మరింత తీవ్రం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోవడంతో మున్సిపల్ చర్చలు మళ్ళీ విఫలమైనాయి. దీంతో తాము సమ్మెను కొనసాగిస్తామని, ఆదివారం నుండి తీవ్రం చేస్తామని మున్సిపల్ కార్మిక సంఘాలు ప్రకటించాయి. శనివారం ఐదు గంటల పాటు రెండు దఫాలుగా చర్చలు జరిగినా కీలకమైన డిమాండ్ల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదు. చర్చల్లో గతంలో ఇస్తున్న వేతనం, ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సు కలిపి రూ.21 వేల వేతనం ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. దీనిపై సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే అదివారికి అందుతోందని, దానికి అదనంగా ఒకనెల బోనస్‌గానీ, కనీసం మూడువేల వేతనం గానీ పెంచాలని కోరారు. దీనికి ప్రభుత్వం అంగీకరించలేదు. రూ.21 వేల వేతనం తప్ప ఇంకేమీ ఇవ్వబోమని తేల్చిచెప్పింది. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పరిహారం పెంచాలని కోరారు. రూ.30 లక్షలు ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. కొన్ని అంశాలపై సానుకూలంగా స్పందించినా కీలకమైన వేతనం పెంపు విషయంలో ప్రభుత్వం ఏ మాత్రమూ స్పందించలేదు. దీంతో కొద్దిసేపు చర్చలు వాయిదాపడ్డాయి. అనంతరం రెండో దఫా చర్చలకు వచ్చిన సమయంలో తాము వేతనాలు పెంపు చేసేది లేదని,కార్మికులు చనిపోతే ఇచ్చే పరిహారాన్ని పెంచుతామని తెలిపారు. రూ.21 వేతనం మాత్రం ఇస్తామని తెలిపారు. ఇప్పుడు వస్తున్నదానికి అదనంగా ఇచ్చేది ఏముంటుందని ప్రశ్నించారు. చర్చల్లో సిఐటియు తరుపున కె.ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి తరుపున రవీంద్రనాథ్, రంగనాయకులు, ఎఐసిటియు తరుపున ప్రసాదు, టిఎన్‌టియుసి తరుపున రఘురామరాజు, ఇంజనీరింగ్ ఉద్యోగ సంఘం తరుపున మధుబాబు తదితరులు హాజరయ్యారు. ప్రభుత్వం నుండి మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి నేరుగాను, మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చల్లో పాల్గొన్నారు. బోనస్ పెంపు, ఇతర అంశాలపై తాము చర్చించుకునేందుకు అవకాశం ఇవ్వాలని మంత్రులు కోరారు.

పాత విషయాలనే చెప్పారు

- కె.ఉమామహేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు)



2

ఎస్మాకు భయపడం

- ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాలను ఐక్యంగా తిప్పికొట్టాలి
- ఏలూరులో అంగన్‌వాడీ నిరాహారదీక్షల ప్రారంభంలో ఎఆర్ సింధు


ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సింధు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎస్మాకు భయపడేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అఖిల భారత కార్యదర్శి ఎఆర్.సింధు తేల్చిచెప్పారు. సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు దిగినా భయపడకుండా ఐక్యతతో ముందుకు సాగి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బీహార్‌లో 18 వేల మందిని, హర్యానాలో తొమ్మిది వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినా వెనక్కి తగ్గకుండా హక్కులు సాధించుకునే వరకూ సమ్మె సాగించి విజయం సాధించారని గుర్తు చేశారు. మహారాష్ట్రలోనూ అంగన్‌వాడీలు పోరాడుతున్నారని వివరించారు. అంగన్‌వాడీలకు మద్దతుగా అన్ని రాష్ట్రాల్లోనూ నిరసనలు చేపట్టాలని సిఐటియు పిలుపునిచ్చిందని తెలిపారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల 24 గంటల రిలే నిరాహార దీక్షలను శనివారం ఆమె ప్రారంభించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి భారతితోపాటు దీక్షలో కూర్చున్న వారందరికీ దండలు వేసిన అనంతరం సింధు మాట్లాడారు. వేతన పెంపు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు వంటి హక్కుల సాధనకు జరుగుతున్న ఈ సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కంటే రూ.వెయ్యి అదనంగా ఇస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో అంగన్‌వాడీలు ప్రాణాలకు తెగించి పని చేశారని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఐసిడిఎస్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిన్నచూపు ఉందని, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగినా వేతనం పెంపు చేయకపోవడం దారుణమని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ నిర్బంధాలకు భయపడకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

జిల్లా కేంద్రాల్లో 24 గంటల దీక్షలు ప్రారంభం
రాష్ట్ర వ్యాప్తంగా ఎస్మా జిఒ దహనం

అంగన్‌వాడీలు ఆందోళనను ఉధృతం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ 24 గంటల దీక్షలు ప్రారంభించారు. డివిజన్, మండల కేంద్రాల్లో సమ్మె శిబిరాలు కొనసాగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఎస్మాను ప్రయోగించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జిఒ 2 కాపీలను సమ్మె శిబిరాల వద్ద దగ్ధం చేశారు. ఎస్మా చట్టం ప్రభుత్వోద్యోగులకు వర్తిస్తుందని, గౌరవ వేతనంతో పని చేస్తున్న తమకు వర్తించదని తెలిపారు. కృష్ణా జిల్లా విజయవాడలో రెండో రోజూ దీక్షలు కొనసాగాయి. శనివారం 24 గంటల దీక్షా శిబిరాన్ని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్‌తో కూడిన ప్రతినిధుల బృందం ప్రారంభించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి పోలారి, ఎఐటియుసి నాయకులు రమేష్‌బాబు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, పిఒడబ్ల్యు నాయకులు దుర్గ, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కన్వీనర్ కృషిబా, విఆర్ఎ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అంజి, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి కిషోర్ వారి ప్రతినిధుల బృందం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు రోజా తదితరులు సందర్శించి మద్దతుగా మాట్లాడారు.

ఎస్మాను ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ గుంటూరులో అంగన్‌వాడీలు ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. జిఒ 2 కాపీలను దగ్ధం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో అంగన్‌వాడీలు ప్రదర్శనగా వెళ్లి ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమ మహేశ్వరరావు ప్రారంభించారు. ఈ శిబిరాన్ని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర సందర్శించి మద్దతు తెలిపారు. విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట 24 గంటల రిలే నిరాహార దీక్షలు పట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో దీక్షలను పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు ప్రారంభించి ప్రసంగించారు. అమలాపురంలో దీక్షలను పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుకూరి స్టాలిన్ మద్దతు తెలిపారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. తమ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఎస్మా జిఒ కాపీని దహనం చేశారు. నంద్యాల జిల్లా కొత్తపల్లిలో అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ నిరసన తెలిపారు. తిరుపతి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ సుధారాణిని చుట్టుముట్టారు. సమస్యలు పరిష్కరించకపోగా నోటీసులు ఇవ్వడానికి రావడ పట్ల నిలదీశారు. దీంతో, ఆమె వెనుదిగారు. గూడూరు, రేణిగుంట, పిచ్చాటూరు, పుత్తూరు, నాయుడుపేటల్లో జిఒ కాపీలను దహనం చేశారు. నల్ల రిబ్బన్లు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేపట్టారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో సమ్మె శిబిరంలో గొబ్బెమ్మలు పెట్టి రామణాచందనాల పాట పాడుతూ వాటి చుట్టూ అంగన్‌వాడీలు ప్రదర్శన చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడలో రహదారిపై ఆటలాడుతూ, సాలూరులో కేబేజి పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో సమ్మె కొనసాగింది.



స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు కేంద్రానికి ఎక్కడిది ?

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, దీన్ని అమ్మేహక్కు కేంద్రానికి ఎవరిచ్చారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1059వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ... విశాఖ ఉక్కు కర్మాగారం పోరాటాలతో ఏర్పాటైందన్నారు. దీన్ని ప్రయివేటు పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై మోడీ సర్కారు అవలంభిస్తోన్న విధానాలపై రాష్ట్రంలోని పార్టీలన్నీ ఉద్యమించాలని కోరారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు మసేన్ రావు, కె.రాజబాబు, ఎన్.రామారావు, డి.దేముడు, డి.రమేష్, జి.ఆనంద్, మోహన్ కుమార్, వర్మ రాజు, కొయిలాడ శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత విషయాలనే చెప్పారు

- కె.ఉమామహేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు)

సమ్మె నేపథ్యంలో మూడోసారి జరిగిన చర్చలు విఫలం అయ్యాయని, గతంలో చెప్పిన అంశాలనే చెప్పారని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇన్ని దఫాలుగా చర్చలు జరిగినా అన్ని సందర్భాల్లోనూ ఒకే అంశాన్ని చెబుతున్నారు తప్ప కొత్తగా చెప్పిందేమీ లేదని అన్నారు.. ఎస్మా ప్రయోగిస్తే ఓటనే ఆయుధం ఉందని, దాన్ని వినియోగిస్తారని, అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు వారి కుటుంబాలు ఇక్కడ ఓటర్లేనన్న విషయాని ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంధ్రనాథ్ మాట్లాడుతూ సమ్మెను కొనసాగిస్తామని, ప్రభుత్వం వేతనాలు పెంచే వరకూ విరమించేది లేదని పేర్కొన్నారు.

సమ్మెను విరమించండి : బొత్స

మున్సిపల్ కార్మికులు సమ్మెను విరమించాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. కార్మికులు అడిగిన అనేక అంశాలను పరిష్కరించామని తెలిపారు. ప్రభుత్వం చేయాల్సిందంతా చేస్తోందని, కార్మికులు కూడా సమ్మెను విరమించాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అణచివేత యత్నాలపై ఆగ్రహజ్వాల

'ఎస్మా' తక్షణ ఉపసంహరణకు అంగన్‌వాడీ యూనియన్ల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించడం ద్వారా శాంతియుత ఉద్యమాలను అణచివేతకు ప్రభుత్వం చేస్తున్న యత్నాలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. అంగన్‌వాడీ యూనియన్లు, కార్మిక, కర్షక, ప్రజా సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజాతంత్ర సంస్థలు ఎస్మా ప్రయోగాన్ని తీవ్రంగా ఖండించాయి. ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు రోజా, కారుసాల సుబ్బారావమ్మ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ, పిఒడబ్ల్యుయు నాయకురాలు దుర్గ తదితరులు పేర్కొన్నారు. ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జీఓ నెంబరు2ను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎస్మా ఎలా ప్రయోగించారో అంతే బాధ్యతగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో శ్రామిక సంఘాలను కలుపుకుని సమ్మెను తీవ్రతరం చేస్తామన్నారు.

అంతిమ విజయం అంగన్‌వాడీలదే : నారా లోకేష్

'అమ్మను గెంటేసిన వాడికి అంగన్‌వాడీల విలువ ఏమి తెలుస్తుంద'ని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. జగన్ అహంకారానికి అంగన్‌వాడీల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న ఉద్యమంలో అంతిమ విజయం అంగన్‌వాడీలదేనని ఆయన పేర్కొన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న అంగన్‌వాడీలపై ఉక్కు పాదం మోపడం దారుణమని పేర్కొన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి టిడిపి పూర్తి మద్దతు ఇస్తుందన్నారు.

ప్రజాస్వామిక వాదులంతా వ్యతిరేకించాలి : సిపిఐ

ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను గాలికి వదిలి రాజకీయాల్లో నిమగ్నమయ్యారని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఎమ్మెల్యేల స్థానాలు మార్చినంత మాత్రాన గెలవడం అసాధ్యమన్నారు.

కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా మద్దతిస్తుందని ఆ పార్టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా, ఎస్మా ప్రయోగించడాన్ని ఆయన ఖండించారు.

ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం : పిడిఎఫ్

అంగన్‌వాడీల సమ్మెను నిషేధిస్తూ ఎస్మా ఉత్తర్వులు ఇవ్వడం దారుణమని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నిరంకుశమైన ఎస్మాను అంగన్‌వాడీలపై ప్రయోగించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమన్నారు. చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, అణిచివేతలతో కాదని హితవు పలికారు. తక్షణమే ఎస్మా ప్రయోగాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తక్షణ ఉపసంహరణకు ఐద్వా డిమాండ్

ఎస్మా ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించి చర్చలకు పిలవాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి డిమాండ్ చేశారు. మహిళల శ్రమను గుర్తించి పర్మినెంట్ చేయకుండా, ఇచ్చిన హామీలను అమల్జేయకుండా నిర్బంధం విధించడం దుర్మార్గమని తెలిపారు.

జిఓ ఉపసంహరించుకోవాలి : ఎస్ఎఫ్ఐ

అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగిస్తూ విడుదల చేసిన జీఓను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి: ఐలు

అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జీఓను తక్షణమే ఉపసంహరించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని ఐలు ప్రతినిధుల బృందం ప్రారంభించింది.

తీవ్రంగా ఖండించిన ఫ్యాప్టో

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని ఫ్యాప్టో తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వం తక్షణమే వారిని చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, ఎస్మా ప్రయోగిస్తూ తీసుకొచ్చిన జీఓను రద్దు చేయాలని ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సిహెచ్ మంజుల డిమాండ్ చేశారు.

ఎస్మా ప్రయోగించడం చట్ట విరుద్ధం : ఎఐటియుసి

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం చట్ట విరుద్ధమని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేషు పేర్కొన్నారు. తక్షణమే ఎస్మాను ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

వెనక్కి తీసుకోవాలి : సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ

అంగన్‌వాడీలపై ఎస్మా జీఓను వెంటనే ఉపసంహరించాలని, డిమాండ్లను పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని సిఐటియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. దాదాపు నెల రోజులుగా పోరాడుతున్న అంగన్‌వాడీలు, వర్కర్స్‌కు తాము మద్దతిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలపై ఎస్మా

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు బుద్ధిచెబుతారని హెచ్చరించాయి తెలుగుదేశం, సిపిఎం, సిపిఐలు ప్రభుత్వ చర్యను ఖండించాయి. ఎస్మా ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి.

జిఓలో ఏముంది?

అంగన్‌వాడీ సేవలను అత్యవసర సేవల కిందకు తీసుకువస్తున్నట్లు జిఓ నెంబర్2లో ప్రభుత్వం తెలిపింది. 'అంగన్‌వాడీ సేవలను అత్యవసర సర్వీసులుగా భావిస్తున్నందున ఆరు నెలల పాటు సమ్మెలు, ఆందోళనలు, నిరసనలు నిషేధిస్తున్నాం' అని పేర్కొంది. 2013 జాతీయ ఆహార భద్రత చట్టం లోని సెక్షన్ 39 కింద అంగన్‌వాడీలు అత్యవసర సర్వీసుల కిందకు వస్తారని పేర్కొన్న ప్రభుత్వం, 1971 అత్యవసర సేవల నిర్వహణ చట్టం కింద సమ్మెను నిషేధిస్తున్నట్లు తెలిపింది. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి సమ్మెను కొనసాగిస్తే అంగన్‌వాడీలను డిస్మిస్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని పేర్కొంది.

ఘనమైన పోరాట చరిత్ర

సమ్మెను అణచివేయడానికి ఎస్మాను ప్రయోగించిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకున్న పోరాట చరిత్రను విస్మరించడం గమనార్హం. మన రాష్ట్రంలో అంగన్‌వాడీలు ఎదుర్కున్న నిర్బంధాన్ని, దానిని అధిగమించిన తీరును ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పరిస్థితులు ఎదురయ్యాయి. అయినా, ఏమాత్రం వెనకడుగు వేయక పోరాటాలను కొనసాగించి సమస్యలను పరిష్కరించుకున్నారు. ఎస్మా విధించిన నేపథ్యంలో ఈ పోరాటాలు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ పోరాట శిబిరాల్లో శనివారం చర్చకు వచ్చాయి. ఆ స్ఫూర్తితో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతామని, వెనకడుగు వేసేది లేదని అంగన్‌వాడీలు ఎక్కడికక్కడ ప్రకటించారు.

జగన్ పాలనపై సర్వత్రా అసంతృప్తి: తెనాలి శ్రావణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసిపి పాలనలో ప్రజలెవ్వరూ సంతోషంగా లేరని టిడిపి మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శించారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్షేమం ముసుగులో జగన్ రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారని పేర్కొన్నారు. ఇందులో బటన్ నొక్కుడు పేరిట రూ.2.5 లక్షల కోట్లు ప్రజలకు చేరగా..మిగిలిన రూ.5.5 లక్షల కోట్ల సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందో ముఖ్యమంత్రి జగన్ చెప్పాలని శ్రావణ్ డిమాండ్ చేశారు. కాగా జగన్ పాలనలో గిరిజన యువత నిర్వీర్యమైపోయిందని టిడిపి ఎస్టి సెల్ అధ్యక్షులు ఎం ధారునాయక్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఎస్సి, ఎస్టి బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేదని ఆయన పేర్కొన్నారు.



షర్మిల కాంగ్రెస్‌లో చేరడం.. చంద్రబాబు కుట్ర : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిక వెనుక టిడిపి అధినేత చంద్రబాబు కుట్ర కోణం ఉందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జలరామకృష్ణారెడ్డి ఆరోపించారు. వైఎస్ జగన్‌ను పదవిలో నుంచి దించడమే చంద్రబాబు లక్ష్యంగా కనిపిస్తోందని అన్నారు. సచివాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప ఉప ఎన్నికల సమయంలో కూడా టిడిపి కాంగ్రెస్‌తో కలిసి ఇలాంటి కుట్రలు చేసిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయన్నారు. అంబటి రాయుడు ఏ కారణంతో రాజీనామా చేశారో తెలియదన్నారు. అంగన్‌వాడీలు అత్యవసర సర్వీసుల కిందకు వస్తారన్నారు. అంగన్‌వాడీల సమ్మె పట్ల ప్రభుత్వం చాలా సంయమనంతో ఉందని సజ్జల పేర్కొన్నారు. అత్యవసర సర్వీసులు కాబట్టే ఎస్మా ప్రయోగమని, సమ్మెకారణంగా వీళ్లు రోడ్లపై ఉన్నారని, గర్భిణులు ఆకలితో అలమటించాల్సి వస్తోందన్నారు.


కనిగిరి - పేదలకు భోజనం వడ్డిస్తున్న చంద్రబాబు

పేదల ఆకలి తీర్చే 'అన్న క్యాంటీన్'

కనిగిరిలో రెండోరోజూ చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి- కనిగిరి (ప్రకాశం)

పేదల ఆకలి తీర్చేది అన్న క్యాంటీనులు అని మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. క్యాంటీన్‌ను ప్రారంభించి 365 రోజులు అవుతున్న సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పేదలకు స్వయంగా భోజనం వడ్డించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు. అనంతరం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రూపొందించిన పాటల సిడిని ఆవిష్కరించారు. వైసిపికి చెందిన పలువురు నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు, నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. కనిగిరిలో 'రా కదలిరా' ఎన్నికల శంఖారావం ప్రారంభం, బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం అమరావతి గ్రౌండ్ నుంచి పెనుగొండ సాధన ప్రాంగణం వద్దకు కారులో చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.


హిస్టరీ కాంగ్రెస్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌లో వక్తలు

ప్రజాశక్తి- సీతమ్మధార (విశాఖపట్నం)

మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ రెండు రోజుల సదస్సు విశాఖలోని బుల్లయ్య కాలేజీలో శనివారం ప్రారంభమైంది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ డిజిపి సి.ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ హిస్టరీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రతి సబ్జెక్టూ తనదైన అవసరానికి ఉపయోగపడుతుందని, యూనివర్సిటీలో ఏ విభాగాన్నీ మూసివేయొద్దని కోరారు. విశాఖ నగరంలో సోషల్ సక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ వకులభరణం రామకృష్ణ మాట్లాడుతూ ఎపి చరిత్రను సదస్సుకు పరిచయం చేశారు. కళల ప్రాముఖ్యత కాలక్రమేణా తగ్గిపోతోందన్నారు. ఆర్ట్ సబ్జెక్టుల ప్రాముఖ్యతను భావితరాలకు అందజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నం సంగ్రహావలోకనం సావనీర్‌ను డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల వైస్ ఛాన్సలర్, ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ కె.సమత ఆవిష్కరించారు. విశాఖ నగర చరిత్ర, సంస్కృతి, దాని పేరు మూలాన్ని వివరించారు. బుల్లయ్య కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఇయర్‌లో ఎపి హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం ఆనందదాయకంగా ఉందన్నారు. కళాశాలలో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు.

కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ముద్రించిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 45వ వార్షిక సెషన్ ప్రొసీడింగ్స్ సంపుటిని ఈ సదస్సులో అతిథులు విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా 50 మంది ప్రతినిధులు, వంద మంది పరిశోధకులు హాజరయ్యారు. ఎపిహెచ్‌సి ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ కెసి.రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్, డాక్టర్ జి.కృష్ణప్రసాద్ బాబు, ప్రొఫెసర్ మల్లి గాంధీ, అజిత్, రూపవాణి, బుల్లయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జిఎన్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బి వెంకట్

ఉత్పత్తి రంగాలను దెబ్బతీస్తున్న కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వలేదన్నారు. మొత్తం జిడిపిలో 40 శాతం వ్యవసాయ రంగం నుంచి వస్తున్నా ఈ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ధనికుల చేతుల్లో ఎక్కువ భూమి ఉందని, ఆ భూమిని పేదలకు పంపిణీ చేయడం ద్వారా వ్యవసాయ కార్మికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. వ్యవసాయరంగానికి ప్రోత్సహకాలు లేకపోవడం వల్ల నష్టాలపాలైన రైతులు పరువు కోసం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆకలి భరించలేక వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో భూ పంపిణీని మేనిఫెస్టోలో పెట్టే పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ స్వామినాథన్, జయతిఘోష్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇప్పటికీ 64 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంటే ఈ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందన్నారు. నూతన ఆర్థిక విధానాల అమలు తరువాత రైతులకు తగిన ప్రోత్సహం లేదని తెలిపారు. వ్యవసాయరంగాన్ని ఏ విధంగా ప్రోత్సహించాలో జయతిఘోష్ కమిటీ అనేక సిఫార్సులు చేసిందన్నారు. ప్రాజెక్టులు నిర్మించి ఉచితంగా సాగునీరు ఇవ్వాలని, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై ఇవ్వాలని సూచించారని వివరించారు. గత ఐదేళ్లలో ఐదు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. బడా పారిశ్రామికవేత్తలు లక్షల కోట్ల రుణాలను ఎగ్గొట్టినా స్పందించని బ్యాంకర్లు సామాన్య రైతులు, కౌలు రైతులు ఒక ఏడాది రుణం కట్టకపోయినా మరుసటి ఏడాది రుణం ఇవ్వడంలేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ వంకాయలపాటి శివనాగరాణి, గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తదితరులు ప్రసంగించారు.

అసైన్డ్ భూములకూ పరిహారం, నష్టపరిహారం చెల్లించాలి

(మొదటిపేజీ తరువాయి)

రఘునందన్ రావు లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం తీర్పు చెప్పింది. నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, గుండవోలు గ్రామానికి చెందిన మద్దె రామయ్య మరో ముగ్గురికి 1978లో 6.19 ఎకరాల భూమిని అసైన్ మెంట్ కింద ఇచ్చారు. కండలేరు రిజర్వాయర్ నిర్మాణం ఆ 6.19 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. అసైన్డ్ భూములు కాబట్టి ఆ భూములకు అధికారులు నష్టపరిహారం చెల్లించకపోవడంతో వారు 2009లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2022లో హైకోర్టు సింగిల్ జడ్జి వాళ్ళ పిటిషన్లను అనుమతించి నష్టపరిహారం, పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు. దీనిపై దాఖలైన అప్పీల్ పిటిషన్ ను ద్విసభ్య ధర్మాసనం కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

నగరపాలక, మున్సిపల్ కార్యాలయాల ముట్టడి

- అధికారులను అడ్డగించిన పారిశుధ్య కార్మికులు
- పలు జిల్లాల్లో అరెస్టులు - 8న కలెక్టరేట్ల ముట్టడి

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని 12 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో నగరపాలక, మున్సిపల్ కార్యాలయాలను శనివారం కార్మికులు ముట్టడించారు. అధికారులను కార్యాలయ లోపలికి వెళ్లనీయకుండా అడ్డగించారు. పోలీసులు బలవంతంగా కార్మికులను అరెస్టు చేశారు. విశాఖలో 400 మంది కార్మికులను అరెస్టు చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే సోమవారం కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు నగరపాలక సంస్థ కార్యాలయం వద్దకు చేరుకుని ఆఫీసు గేట్లను మూసివేశారు. దీంతో సిబ్బంది, ఉద్యోగులు బయటే నిలిచిపోయారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి మున్సిపల్ కార్మికుల సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎనిమిదో తేదీన కలెక్టరేట్ల ముట్టడిస్తామని హెచ్చరించారు.



విశాఖలో మున్సిపల్ కార్మికులను, సంఘం నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పలువురి నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెంలో మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించి అధికారులను, ఉద్యోగులను విధులకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.

విశాఖలోని జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న 400 మంది మున్సిపల్ కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. కొంతమందిని ఉదయం నుంచే గృహ నిర్బంధం చేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు వి.కృష్ణారావు తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు. అనకాపల్లి పట్టణంలో పలుమార్లు చెత్త తొలగించేందుకు అధికారులు వాహనాలను తీసే ప్రయత్నాన్ని కార్మికులు అడ్డుకున్నారు.

ఒంగోలులో కార్పొరేషన్ కార్యాలయం గేట్ ముందు బైటాయించి లోనికి ఎవ్వరిని వెళ్లనీయకుండా అడ్డుగా మున్సిపల్ కార్మికులు కూర్చుకున్నారు. మున్సిపల్ ఆఫీసు గేట్లు తెరవాలని, కార్యాలయం లోపల ఉన్న కమిషనర్ కారు, చెత్త వాహనాలను బయటకు పంపాలని కార్మికులకు పోలీసులు సూచించారు. అందుకు కార్మికులు నిరాకరించడంతో బలవంతంగా కార్మికులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. సిఐటియు నాయకులను బలవంతంగా అరెస్టు చేయడంతో కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని విడిచిపెట్టి వెళ్లిపోయారు.

విజయనగరంలో నగర పాలక కార్యాలయం వద్ద కార్మికులంతా బైఠాయించి పోటీ కార్మికులు రాకుండా అడ్డుకున్నారు. బొబ్బిలి మున్సిపల్ కార్యాలయ ముట్టడి నేపథ్యంలో పలువురి కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కర్నూలు జిల్లా గూడూరులో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు వంటా వార్పు చేపట్టారు. నంద్యాల,ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో పోటీ కార్మికులతో పని చేయించడాన్ని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో మున్సిపల్ కార్యాలయం వద్ద చెత్త వేసి నిరసన తెలిపారు.శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురంలో మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించారు. నెల్లూరులో దర్గామిట్ట బారాషాహిద్ దర్గా నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయ ప్రధాన గేటు ఎదుట బైటాయించి నిరసన చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు, కృష్ణాలో ఆందోళనలు కొనసాగాయి.

బోటులో అగ్నిప్రమాదం

డ్రైవర్ సజీవ దహనం

ప్రజాశక్తి - యానాం



యానాంలోని దరియాలతిప్ప వద్ద ఓ బోటు అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బోటు డ్రైవర్ సజీవ దహనమయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... దరియాలతిప్ప జెట్టీ వద్ద కామాడి నాగేశ్వరరావుకు సంబంధించిన బోటులో ముగ్గురు కార్మికులు వెల్డింగ్ పని చేస్తున్నారు. ఈ సమయంలో బోటులో డీజిల్ ఉండడంతో నిప్పురవ్వలు పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కార్మికులు బోటు లోపలి నుంచి బయటకు వచ్చేశారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈ సమయంలో ఒడ్డున ఉన్న నాగేశ్వరరావు సోదరుడు, బోటు డ్రైవర్ కామాడి గంగాద్రి (40) మంటలను ఆర్పేందుకు బోటులోకి వెళ్లారు. మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే గంగాద్రి మరణించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

99 శాతం హామీలు అమల్జేశామనడం మోసం

- వైసిపిపై టిడిపి ఎంపీ కనకమేడల విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమల్జేశామని చెప్పడం ప్రజలను మోసగించడమేనని వైసిపి ప్రభుత్వంపై టిడిపి ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ విమర్శలు గుప్పించారు. హామీల అమలుకు సంబంధించి ఇప్పటికైనా జగన్ వాస్తవాలు వెల్లడించాలని, ఆ తర్వాతే ఆయన ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో కేవలం 15 శాతమే అమల్జేశారని, నాలుగేళ్ల 9 నెలల పాలన విధ్వంసకరం, నియంతృత్వం, అవినీతి, అబద్ధాలమయంగా సాగిందని ఆరోపించారు. మద్యపాన నిషేధం, సిపిఎస్ రద్దు, ప్రత్యేక హోదా, 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపు హామీలన్నీ ఏమయ్యాయని కనకమేడల ప్రశ్నించారు.

జనసేనతో పొత్తు ఉంది

- బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి

ప్రజాశక్తి-ఏలూరు

జనసేనతో బిజెపి పొత్తు ఉందని, రాష్ట్రంలో ఇతర పార్టీల పొత్తుపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి అన్నారు. ఏలూరులో బిజెపి రాష్ట్రస్థాయి వివిధ మోర్చాల పదాధికారుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో టిడిపి, ఇప్పుడు వైసిపి కేంద్ర ప్రభుత్వ పథకాలకు వారి స్టిక్కర్లు అతికిస్తున్నారని విమర్శించారు. ఎస్‌సిలకు సంబంధించిన 27 పథకాలను వైసిపి రద్దు చేసిందన్నారు. రిజర్వేషన్ ఉంది కాబట్టి వైసిపిలో న్యాయం జరిగిందని డిప్యూటీ సిఎం నారాయణస్వామి అన్నారని, దీనిబట్టి ఎస్‌సి ప్రజాప్రతినిధులు ఎంత వివక్షతకు గురవుతున్నారో అర్థమవుతుందని తెలిపారు. సమావేశం జరుగుతున్న సమయంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపి మాగంటి బాబు పురంధేశ్వరిని కలవడం చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, వివిధ మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అసైన్డ్ ఇంటి స్థలాలకు

రెండు నెలల్లో భూ యాజమాన్యపు హక్కులు

- కసరత్తు ప్రారంభించిన రెవెన్యూ
- నిజమైన అసైనీ చేతుల్లో ఉన్న భూముల గుర్తింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇంటి స్థలానికి అసైన్డ్ పట్టా పొంది పదేళ్లు పూర్తయిన లబ్ధిదారులకు ప్రభుత్వం భూ యాజమాన్యపు హక్కులు కల్పించే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయనుంది. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి చాలా కాలమైనప్పటికీ కార్యాచరణ షెడ్యూల్ నిర్దిష్టంగా ఎప్పటి లోగా పూర్తి చేయాలనే గడువు పేర్కొనక పోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈనేపథ్యంలో తాజాగా సిసిఎల్ఎ, ఆయా జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో రెవిన్యూశాఖ కసరత్తును ప్రారంభించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ 2 నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఇంటి స్థలం పొందిన అసైనీదారుడు లేదా చట్టబద్ధమైన వారి వారసులు పేరుతో రికార్డుల్లో కొనసాగుతున్న స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టారా? లేక ఖాళీ స్థలంగానే ఉందా? భౌతికంగా నిజమైన అసైనీదారుల చేతుల్లోనే ఆయా స్థలాలు, ఇళ్లు ఉన్నాయా? లేదా అనే విషయాన్ని రెవిన్యూ అధికారులు నిర్ధారించి అర్హత జాబితాను తయారు చేసి ఆయా జిల్లా కలెక్టర్లకు పంపాల్సి ఉంటుంది. ఒక్కో గ్రామం పూర్తయిన తర్వాత మరొక గ్రామంలో ఈ ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుందని ప్రభుత్వం అధికారులకు సూచించింది. అర్హుల జాబితాను తయారు చేసేందుకు ఫార్మట్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. 22(ఎ) జాబితా నుంచి తొలగించడానికి జిల్లా రిజిస్ట్రార్‌కు ఇంటి స్థలాలను , జిల్లా గెజిట్‌లో జాబితాలో ప్రచురించాల్సి ఉంటుంది. ఇదే సందర్భంలో ఆర్‌డిఓ/ సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు గతంలో కేటాయించిన ఇంటి స్థలాల వివరాలు సమర్పించడానికి తహసీల్దార్లకు ఆన్‌లైన్ ఫ్రీ హోల్డ్ హౌస్ సైట్‌ల మాడ్యూల్‌కు కూడా ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అనంతరం క్షేత్రస్థాయిలోని విఆర్‌ఓ, ఎంఆర్‌ఓలు ధృవీకరించిన జాబితాను ప్రభుత్వం ఆమోదిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.



భూ యాజమాన్యపు హక్కు కల్పించడం ఇలా:

అసైనీదారుడు ఇంటి స్థలం పట్టా పొంది పదేళ్లు పూర్తయినట్లు నిర్ధారించిన తర్వాత ఆయా గ్రామాల విఆర్‌ఓ డేటాను నమోదు చేయాల్సి ఉంటుంది. గుర్తింపు ప్రక్రియకు సంబంధించి 15 కాలమ్స్‌తో ప్రభుత్వం ప్రొఫార్మాను ప్రభుత్వం విడుదల చేసింది. ఫార్మాట్‌లో సీరియల్ నెంబరు, వెబ్‌ల్యాండ్ ప్రకారం సర్వే నెంబరు, సర్వే నెంబర్ మొత్తం పరిధి, భూమి ఏ రకం, భూమి వర్గీకరణ, లే అవుట్/వ్యక్తిగత పట్టా, లే అవుట్ సంఖ్య ఏదైనా ఉంటే, ప్లాట్ యొక్క నంబర్, విస్తీర్ణం, అసైనీదారుని పేరు, తండ్రి/భర్త పేరు, అసైన్‌మెంట్ నంబర్ ఏదైనా ఉంటే, వ్యక్తి అసలు అసైనీ, అసలైన అసైనీ/ చట్టపరమైన వారసుడు, స్థలం కేటాయించిన సంవత్సరం తదితర వివరాలను ఫార్మాట్‌లో విఆర్‌ఓ నమోదు చేయాల్సి ఉంటుంది.

అభ్యంతరాలకు 7 రోజులు

తహసీల్దార్లు డేటా ఎంట్రీ , ధృవీకరణ పూర్తి చేసిన అనంతరం 22(ఎ) నుంచి తొలగించడానికి అర్హత పొందిన అసైన్డ్ పట్టా పొందిన లబ్ధిదారుల జాబితాతోపాటు పబ్లిక్ నోటీసును గ్రామ /వార్డు సెక్రటరియేట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని విచారించి నిబంధనల ప్రకారం పరిష్కరించాల్సి ఉండటంతో పాటు గ్రామ సభ పెట్టి డేటా కరెక్టేనా అనే అంశాన్ని ధృవీకరించాల్సి కూడా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంటోంది. తహసీల్దార్లు సిఫార్సులు పూర్తి చేసిన తర్వాత ఆర్‌డిఓ /సబ్ కలెక్టర్ కేటాయించిన లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తారు. అనంతరం జాబితాను జాయింట్ కలెక్టర్‌కు పంపుతారు. పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారు.

రూ.29,048 కోట్లు కావాలి

- బిసి సంక్షేమానికి అధికారుల ప్రతిపాదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రానున్న ఆర్థిక సంవత్సరంలో బిసిలకు ప్రస్తుతమున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు కొనసాగేందుకు 29,048 కోట్ల రూపాయలు కావాలని అధికారులు ప్రతిపాదించారు. ఎన్నికల సంవత్సరం కావడంతో కొత్త పథకాలను ప్రకటిస్తే వాటి అమలుకు అదనపు నిధులు కేటాయించాల్సి వస్తుందని పేర్కొన్నారు. నూతన ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ కసరత్తులో భాగంగా ఈ ప్రతిపాదనలు చేశారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఓట్ ఆన్‌అక్కౌంట్‌కు అనుమతి కోరనున్నప్పటికీ ఏడాది మొత్తాన్ని దృష్టిలో ఉంచుకునే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసే సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 29,048 కోట్లు కావాలని ప్రతిపాదించిన వెనుకబడిన తరగతుల శాఖ దానిలో పింఛన్లకు 10,817 కోట్లు అవసమవుతాయని ప్రతిపాదించారు. ఇక వెనుకబడిన సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన బిసి కమిషన్, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత పథకాలకు కూడా భారీగానే నిధులు కోరుతున్నారు. అమ్మఒడికి 3,514 కోట్లు, చేయూత పథకానికి 3,547 కోట్లు, ఆసరా కోసం 3,347 కోట్లు కావాల్సి ఉంటుందని అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. అయితే ఇంత భారీగా ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నప్పటికీ ఆర్థికశాఖ ఎంత వరకు కేటాయింపులు చేస్తుందో చూడాల్సి ఉంది. గతేడాది కూడా భారీగానే ప్రతిపాదనలు సమర్పించగా, అందులో ఆర్థికశాఖ కోతలు విధించడం తెలిసిందే.

పలు రంగాలకు సిద్ధంచేసిన ప్రతిపాదనలు ఇవే (రూ.కోట్లలో)

బిసి కమిషన్	316
అమ్మఒడి	3,514
విద్యాదీవెన	1,487
వసతి దీవెన	1,185
జగనన్న చేయూత	3,547
వైఎస్ఆర్ ఆసరా	3,356
వైఎస్ఆర్ పెన్షన్ కానుక	10,817
వైఎస్ఆర్ నేతన్న హస్తం	190
మత్స్యకార భరోసా	126
వైఎస్ఆర్ వాహనమిత్ర	160
జగనన్న చేదోడు	304
కళ్యాణమస్తు	125

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన ఎస్ఎస్ఎల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 18వ రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనను కొనసాగించారు. జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని నినదించారు. విజయనగరం జిల్లా బైక్ ర్యాలీలో ఆ సంఘం జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు, సిఆర్‌పి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చలో విజయవాడ కార్యక్రమాన్ని అణచివేసే చర్యలను ఖండించారు. అరెస్టులతో ఉద్యమాన్ని, తమ గొంతును నొక్కడం సరికాదని అన్నారు. అనకాపల్లి డిఇఒ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఎ ఉద్యోగులు నిద్రకు ఉపక్రమించి నిరసన తెలిపారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమ్మెను కొనసాగించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ధర్నా చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద సమ్మె శిబిరాన్ని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమ మహేశ్వరరావులు సందర్శించి మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద విధుల్లో చేరకపోతే సమగ్ర శిక్ష ఉద్యోగులను తొలగిస్తామంటూ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇచ్చిన షోకాజ్ నోటీస్‌లను దగ్ధం చేశారు.

గుంటూరులో ర్యాలీ నిర్వహిస్తూ దారిన వెళ్లే వారికి పూలు అందజేసి నిరసన తెలిపారు. పల్నాడు జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపి ప్రసంగించారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, కర్నూలు, నంద్యాల, శ్రీకాకుళం, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, కడప, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో సమ్మెను కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిరకాల ఇబ్బందులు పెట్టినా, ఆంక్షలు విధించినా పోరాటం చేస్తామని ఎస్ఎస్ఎలు ప్రకటించారు.

సంపాదకీయం

పోస్టుకార్డు!

'ఇక్కడ నేను క్షేమం–అక్కడ నువ్వు కూడా/ ముసలి అమ్మా, పాత మంచంకోడూ/మన చిన్నబ్బాయి, చెరువులో కొంగా' అని మొదలవుతుంది ఒక 'సైనికుడి ఉత్తరం'. 'దూరాభారాన ఉన్న కుమారుని కోసం/ వగచే తల్లికి/ చేరువ చేరువౌవుతున్న నువ్వొక ఊరట/ దగ్గర దగ్గరౌతున్న మిత్రుని లేఖకోసం/ నిలిచిన తరుణికి నీ రాక ఒక బాసట/ వర్తకుడికి నర్తకుడికి ఖైదులో దొంగకి హంతకుడికి/ ఉద్యోగ శప్తుడైన నవీన యక్షునికి/ మనిషికి రాక్షసునికి/ నువ్వు/ దూరాల దారాల్ని విచిత్రంగా/ ఒకే నిమిషము/ అనే కండె చుట్టూ తిప్పగల నేర్పరివి– కూర్పరివి' అంటాడు తిలక్. అనేక బంధాలను ముడివేసే దారం ఉత్తరం. ఉత్తరం అంటేనే మధురమైన జ్ఞాపకం. ఉత్తరం చూసినా, చదివినా ఎన్నో మధురమైన జ్ఞాపకాలు, ఆనందాలు, సంతోషాలు, చేదు నిజాలు, కష్టమైన సంఘటనలు ఎన్నో గుర్తొస్తాయి. అంతటి అనుబంధం ఒక్క ఉత్తరంలోనే వుంది. ఏ తీగకో గుచ్చి... ఓ మూలన వేలాడదీసిన ఉత్తరాలు...సంవత్సరాల తరబడి ఎన్నో జ్ఞాపకాలను తమలో దాచివుంచేవి. ఎప్పుడైనా వాటిని కదిలిస్తే... దోసిట్లో లంకె బిందెల్లా దొర్లిపడతాయి జ్ఞాపకాలు. పుట్టుక నుంచి చావు వరకు ప్రతి సందర్భంతోనూ ఎన్నెన్ని అనుబంధాలను పోగేసుకున్నాయో ఈ ఉత్తరాలు.

పోస్టుకార్డుకు చాలా పెద్ద చరిత్ర వుంది. ఒకప్పుడు క్షేమ సమాచారం తెలుసుకోడానికి పోస్టుకార్డే ప్రధాన ఆధారం. సాంకేతికత పెద్దగా విస్తరించని కాలంలో ఉత్తరమే మనుషుల మధ్య వారధి, సమాచారాన్ని చేరవేసే సారథి. ఒకరి క్షేమ సమాచారాలను, లోలోపలి భావోద్వేగాలను మరో మనిషికి అందజేసే వాహికలు ఉత్తరాలు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనుమరుగైంది. ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, ఇ–మెయిల్స్ సదుపాయం పెరగడంతో ఉత్తరం పాత్ర రోజురోజుకూ తగ్గిపోయింది. అయితే, ఇప్పటికీ పోస్టుకార్డును వినియోగిస్తున్న మారు మూల ప్రాంతాలు లేకపోలేదు. ఇ–మెయిల్ నిమిషాల వ్యవధిలో ప్రపంచంలోని ఏ మూలకైనా సమాచారాన్ని పంపించగల వ్యవస్థ. కానీ సమాచార వ్యవస్థ ప్రారంభంలో రాసిన తాళపత్రాన్ని దూరప్రాంతాలకు గుర్రాలపై తీసుకెళ్లి, తిరిగి జాబు కూడా తీసుకొచ్చేవారు. అంత ప్రాచీన కాలంలో కూడా సమాచార వ్యవస్థకు వున్న ప్రాధాన్యత ఈ విషయం ద్వారా తెలుస్తుంది. ఆ తర్వాత కాలంలో ప్రింటింగ్ యంత్రాలు వచ్చి, రవాణా సౌకర్యాలు పెరిగి, ఆవిరి యంత్రం వంటివి అందుబాటులోకి వచ్చిన తర్వాత పోస్టుకార్డు వచ్చింది. పోస్టుకార్డును తొలిసారిగా 1861లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోనూ, మన దేశంలో 1879 జులై ఒకటిన ప్రవేశపెట్టారు. సుమారు పదిహేనేళ్ళ కిందటి వరకు పోస్టుకార్డుకు జనజీవనంతో విడదీయలేని సంబంధం ఉండేది. ఇంటర్నెట్, సెల్‌ఫోన్‌లు అందుబాటులోకి రావడంతో ఉత్తరాలు, పోస్టుకార్డులకు బ్రేక్ పడింది. ఒకప్పుడు దూరాలను కరిగించి, అనుబంధాలను దగ్గర చేసేవి. ఇప్పుడు మనుషులంతా దగ్గరైనట్లే వుంటారు గాని భౌతికంగా దూరమౌతున్నారు. మానసికంగా దగ్గరవుతున్నట్లు అనిపిస్తున్నా...అది ఎంతవరకూ అనేది అంతుచిక్కని విషయం. సాంకేతిక పెరుగుదల అవసరమే గానీ, మానవ స్పర్శ, స్పందన ఇ–మెయిల్‌తో లభించదు. పోస్టుకార్డు అందుకొని అందులోని విషయాన్ని చదువుకున్న అనుభూతి మాత్రం రాదు. ఉత్తరంలోని తనవారి దస్తూరిని చూసుకొని, ఆ అక్షరాలను చేత్తో తడుముకొని, గుండెలకు హత్తుకుంటే.. వారిని భౌతికంగా స్ప్రృశించిన అనుభూతి చాలామందికి అనుభవమే.

సమాచార వ్యవస్థలో మానవత్వ స్పర్శ ఉత్తరం. ఈ కార్డు ముక్క...అప్పుడొక అవసరం. ఎప్పుడూ మధురమైన జ్ఞాపకం. అప్పుడప్పుడు ఉద్యమ రూపం. సాహిత్య ప్రక్రియగా కూడా ఉత్తరం యొక్క ప్రాశస్త్యం అనన్యమైంది. ప్రత్యేకించి మనసులోని మమతనంతా రంగరించి రాసిన చలం 'ప్రేమ లేఖలు', మార్క్స్–ఎంగెల్స్ మధ్య నడిచిన ఉత్తరాలు, నెహ్రూ తన కుమార్తె ఇందిరకు రాసిన లేఖలకు చాలా ప్రత్యేకత వుంది. ఆనాటి అమెరికా అధ్యక్షుడు థామస్ జఫర్సన్ తన జీవిత కాలంలో దాదాపు ఇరవై వేల ఉత్తరాలు రాశారట. గాంధీజీ, ప్రేమ్‌చంద్ లేఖలు, చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగులో రాసిన ఉత్తరాలూ ప్రత్యేకమే. శ్రీశ్రీ, ఆరుద్ర, గురజాడ, బోయి భీమన్న వంటి వారి ఉత్తరాల్లో తెలుగు సాహిత్యం ఉట్టి పడుతుంది. పాలకులకు ఉత్తరాలు రాయడం కూడా ఆనవాయితీగా వస్తోంది. అందుకే ప్రతిపక్షాలు, ఉద్యోగ సంఘాలు, కార్మిక నాయకులు తమ డిమాండ్లను ఉత్తరాల ద్వారా తెలుపుతున్నారు. పోస్టుకార్డు ఉద్యమ రూపానికి ఇప్పుడొక నిర్వచనం. మానవ హక్కుల ఉద్యమాలు, ప్రజా ఉద్యమాలు పోస్టుకార్డును ఉద్యమ రూపంగా వాడుతున్నాయి. నిరంకుశత్వం, నిర్లక్ష్యం వున్నంతకాలం నిరసనలు, ఉద్యమాలు వుంటాయి. మనిషి వున్నంతకాలం మానవ స్పర్శ వుంటుంది. స్పర్శ వున్నంతకాలం పోస్టుకార్డూ వుంటుంది. ఈ పోస్టుకార్డు కలకాలం బతకాలని ఆశిద్దాం.

మహనీయుల మాట



ప్రజలు భూమి లాంటి వాళ్లు.
కమ్యూనిస్టులమైన మనం విత్తనాల లాంటి వాళ్లం. మనం ఎక్కడకు వెళ్లినా...ప్రజలతో ఐక్యమవ్వాలి.
ప్రజల్లో వేరూని, పెరిగి వారి మధ్యనే వికసించాలి.
- మావో జెడాంగ్,
చైనా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు

毛泽东

అన్ని వ్యవస్థలు అదానీ వైపే!

ప్రస్తుతం



తెలకపల్లి రవి

సుప్రీంకోర్టు తీర్పు కారణంగా అయోధ్యలో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలా రామమందిర ప్రాణ ప్రతిష్ట 22న జరగబోతున్నది. మధుర, కాశీ మందిరాల వివాదాలను కూడా తిరగదోడే న్యాయ ప్రక్రియ పూర్తయిపోయింది. క్రోనీ కార్పొరేట్ సామ్రాజ్యాధినేత గౌతమ్ అదానీ గ్రూపు అక్రమాలపై అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన ఫిర్యాదుల కేసును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆ తీర్పు వచ్చిన మరుసటి రోజునే మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) నిబంధనలు మార్చింది. పైకి విడివిడిగా కనిపించే ఈ పరిణామ క్రమం వెనక వున్న వ్యవస్థాగతమైన లింకేమిటో తెలియాలంటే న్యాయం అన్నదాని గురించి కారల్ మార్క్స్ ప్రసిద్ధ వాక్యాలు గుర్తు చేసుకోవలసి వుంటుంది. 'చట్టం వ్యవస్థపై ఆధారపడి వుంటుంది గానీ వ్యవస్థ చట్టంపై ఆధారపడి వుండదు.' 'మత రాజ్య వ్యవస్థలో దైవ దూషణ అన్నిటి కంటే పెద్ద నేరంగా వుంటుంది. రాచరికంలో రాజద్రోహానికి అత్యధిక శిక్ష. వర్గ సమాజంలో ప్రైవేటు ఆస్తికి భంగం కలిగించే చర్య అనుమతించబడదు.' 45 ఏళ్ల కిందట ఆంధ్రా యూనివర్సిటీ ప్రసంగంలో ఈ వాక్యాలను ఉటంకించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిన్నపరెడ్డి దాన్ని వివరించడానికి మూడు ఉదాహరణలివి. విచిత్రంగా ఇప్పుడు భారత దేశంలో ఈ మూడు లక్షణాలు కలిసి కనిపిస్తున్నాయి. గుళ్లూ గోపురాల వివాదాలు, రాజద్రోహ కేసులు, బడా ఆశ్రిత పెట్టుబడిదారులను కాపాడే మార్కెట్ శాసనాలు ఏక కాలంలో అమలవుతున్నాయి.

అదానీ అనుబంధం, హిండెన్‌బర్గ్ పరిశోధన

నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి కేంద్రం వత్తాసుతోనే దేశ విదేశాల్లో అదానీ గ్రూపు చెలరేగిపోవడం అందరికీ తెలిసిన విషయమే. ప్రభుత్వ సంస్థల ఆస్తులు, కాంట్రాక్టులు దానికే వెళ్లేలా చేయడంలో బిజెపి ప్రభుత్వ పాత్ర చాలా సార్లు వెల్లడైంది. ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి దేశాల్లోనూ అదానీ గ్రూపు తరపున మోడీ సిఫార్సులు చేసినట్టు ఆ దేశాల నేతలే వెల్లడించారు. ఎ.పి లో గంగవరం, కృష్ణపట్నం వంటి రేవులతో సహా, భోగాపురం ఎయిర్‌పోర్ట్ సహా అనేక ఆస్తులు, టెంటర్లు వారికే దక్కాయి. మరోవైపున స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు షేర్ల రేట్లు విపరీతంగా పెరిగిపోతూ వచ్చాయి. అతి పెద్ద కార్పొరేట్‌గా అంబానీల స్థానంలో అదానీ అవతరిస్తున్నట్టు కనిపించింది. అటు అదానీ ఇటు అంబానీ మధ్యలో ప్రధాని అనేది నానుడిగా మారింది. అంబానీలు అన్ని ప్రభుత్వాల్లోనూ చక్రం తిప్పినా మోడీ హయాంలో ఆయన ఇష్టుడైన కుబేరుడుగా అదానీకి తిరుగులేకుండా పోయిందని పారిశ్రామిక వర్గాలు భావించాయి. ఇలాంటి తరుణంలో 2023 జనవరి 24న హిండెన్‌బర్గ్ రిసెర్చి గ్రూపు అదానీ వ్యవహారాలపై ఒక సంచలన పరిశోధనా నివేదిక ప్రకటించింది. ఈ గ్రూపు షేర్లు ఇంతగా విజృంభించడం వెనక అనైతిక ఆర్థిక పద్ధతులు న్నాయనీ వెల్లడించింది. అదానీ గ్రూపు బినామీల ద్వారా తన షేర్లను అరువు తీసుకొని మార్కెట్ రేటుకు అమ్ముతూ మళ్లీ తక్కువ రేటుకు కొంటూ, కృత్రిమంగా గిరాకీ పెంచినట్టు వెల్లడించింది. స్టాక్ మార్కెట్ భాషలో దీన్నే షార్ట్ సెల్లింగ్ అంటారు. అంటే ఒక సంస్థ మార్కెట్‌లో తన షేర్లను తనే తీసుకుని భారీగా అమ్మడం, తర్వాత చౌకగా కొనడం, రేటు పెరిగాక విడుదల చేయడం. ఇదే ఒక అభ్యంతరకర మార్గమైతే ఆ సంస్థకు సంబంధించిన బినామీలు లేదా భాగస్వాముల ద్వారానే భారీగా కొనుగోళ్లు, అమ్మకాలు చేయించి జోరుగా పెరిగిపోతున్న భ్రమ కలిగించడం. ఇదంతా ఎందుకంటే సాధారణ మదుపరులు ఎగబడిపోయి షేర్లు కొనుగోలు చేయడానికి. మార్కెట్ విలువ బాగా పెంచి చూపించి రుణాలు, అడ్వాన్సులు పుట్టించుకోవడానికి, అన్నిటినీ మించి ప్రత్యర్థులను దెబ్బ తీయడానికి, ఈ క్రమంలో వీటినే ఆధారంగా చూపి ప్రభుత్వ బ్యాంకులు ఆర్థిక సంస్థల నుంచి ఉదారంగా అప్పులు, భాగస్వామ్యాలు పొందడానికీ ఇవి ఉపయోగపడతాయి. అదానీ విషయంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సహా అనేక సంస్థలు విస్తారంగా సహకరించాయి. ఇదేగాక షేర్ల కొనుగోలులోనూ అవీ పాలుపంచుకున్నాయి. ఈ క్రమంలో విపరీతంగా వందల కోట్లు చేతులు మారి మనీ లాండరింగ్ కార్యకలాపాలు సాగాయి. దీనిపై రెండేళ్ల పరిశోధన జరిపి ఇందుకు సంబంధించిన అనేక వాస్తవాలు, వివరాలు హిండెన్‌బర్గ్ బయిటపెట్టింది. ఆ సమయంలో అదానీ గ్రూపు పెరుగుదల 817 శాతంగా వుండింది. ఆస్తుల విలువ రూ.17,80,000 కోట్లు. ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీ వ్యవహారాలపై వెంటనే దర్యాప్తు జరపాలనీ, అన్ని నిజాలు బయిటపెట్టాలనీ ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి.

> **కంపెనీల షార్ట్ సెల్లింగ్‌పై సెబీ నిబంధనలను తాము నియంత్రించలేమని కూడా చేతులెత్తేసింది. చాలా కాలంగా ఈ విషయంలో పాటిస్తున్న నియంత్రణను కొంతకాలం కిందట మార్చినట్టు వాదించిన సెబీ సమర్థనను ఈ విధంగా సుప్రీం తీర్పు కూడా ఆమోదించింది. అదానీ గ్రూపుపై విస్తారమైన పరిశోధనల సమాచారం, నివేదికలు అందుబాటులో వున్నా సెబీ వాటిని ఉపయోగించుకోలేక పోయిందని తాను నియమించిన కమిటీయే చెప్పినా ధర్మాసనం పట్టించుకోలేదు. పైగా వీరంతా చట్టబద్ధమైన సెబీ నియంత్రణ సంస్థగా విచారిస్తుంటే థర్డ్ పార్టీ (బయిటివారు) ఎందుకని ప్రశ్నించింది. పత్రికల్లో మీడియాలో వచ్చిన నివేదికలను, కథనాలను పరిగణనలోకి తీసుకోనవసరం లేదని ఎదురు వాదించింది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ పేపర్స్ (ఒసిసిఆర్‌పి) విడుదల చేసిన నివేదికను పిల్‌లో ప్రస్తావించడాన్ని తోసిపుచ్చింది. ఇది సహజ న్యాయ సూత్రాలకే విరుద్ధమని చెప్పనక్కర్లేదు.**



సుప్రీం కోర్టులో జరిగిందేమిటి?

అదానీపై తీవ్రమైన ఈ ఆరోపణలను విచారించడం కోసం ఒక కమిటీని నియమించాలంటూ ఫిబ్రవరిలో సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది. కోర్టులోనూ పార్లమెంటులోనూ పోరాటం జరుగుతున్నా కేంద్రం కనీసంగా స్పందించలేదు. అదానీ గ్రూపు తనను తాను సమర్థించుకుంటూ ఎదురు దాడి చేసింది. అంతేగాక దూసుకుపోతున్న భారతీయ కంపెనీని దెబ్బ తీయడం కోసం దేశ వ్యతిరేక శక్తులు కుట్రలు పన్నుతున్నాయని బిజెపి నేతలు కొత్త పల్లవి అందుకున్నారు. ఎట్టకేలకు మూడు మాసాల తర్వాత మార్చి 2న సుప్రీంకోర్టు దీనిపై విచారణ జరిపి రెండు మాసాలలోగా నివేదిక నివ్వాలని సెబీని ఆదేశించింది. స్టాక్ మార్కెట్ లావాదేవీలలోనూ డబ్బు మార్పిడిలోనూ అక్రమాలు నిగ్గు తేల్చాలన్నది. మరోవైపున కోర్టు తరపున కూడా ఒక త్రిసభ్య కమిటీని నియమించింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే అధ్యక్షతన ఈ కమిటీ నివేదిక మే 19న అందజేసింది. అక్రమాలకు పాల్పడినట్టు ఆధారాలు దొరకలేదని సమర్థించింది. దీనిపై సెబీ వ్యవహరించిన తీరులోనూ ఉల్లంఘనలు లేవంటూనే పూర్తి వివరాలు రాబట్టడంలో అది విఫలమైనట్టు పేర్కొంది. ఏవో పరిశోధనా సంస్థలు అనేక ఆరోపణలు తీసుకొచ్చినా వాటి మూలాలలోకి వెళ్లడంలో సెబి కృతకృత్యం కాలేకపోయింది. అదానీ గ్రూపు షేర్ల విపరీత పెరుగుదల కారణాలు, పెట్టుబడి పెట్టిన కంపెనీలతో వారి బాంధవ్యం వంటి అంశాలను కూడా నిగ్గు తేల్చలేదని విమర్శించింది. సెబీ నిబంధనల మార్పు వల్ల పారదర్శకత లేకుండా పోయిందనీ, లోపాయికారీ పెట్టుబడులు సమకూర్చేవారి వివరాలు దాచిపెట్టబడ్డాయనీ కూడా ఈ కమిటీ చెప్పింది. నిజానికి 2014 లోనే డిఆర్‌ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్) దృష్టికి ఈ ఆరోపణలు వచ్చాయనేది ఇక్కడ గమనించాలి. వీటిపై విచారణ జరుగుతున్నట్టు 2020లో 2021లో పార్లమెంటుకు కేంద్రం సమాధానమిచ్చింది. తీరా చూస్తే ఆ దర్యాప్తు లోపభూయిష్టంగా వున్నట్టు సుప్రీం నియమించిన కమిటీనే ఇక్కడ చెప్పడం గమనించదగింది. ఈలోగా తాజా ఆదేశాల ప్రకారం రెండు మాసాల్లో నివేదిక నివ్వాల్సిన సెబీ ఆగష్టు వరకూ పొడగింపు పొందింది. ఇలా మొత్తం ప్రహసనంగా మారిపోగా రాజకీయంగా దానిపై ఎంత కల్లోలం రేగుతున్నా అదానీ మాత్రం యథాతథంగా కార్యకలాపాలు సాగిస్తూ పోయారు. నవంబరు నాటికి వాదనలు వినడం పూర్తి కాగా తీర్పు రిజర్వు చేసిన చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ధర్మాసనం జనవరి 3న ప్రకటించిన తీర్పు దేశానికి దిగ్భ్రాంతి కలిగించింది.

అయితే ఓకె..అంతా రైటే..

సెబీ విచారణలో ఎలాంటి పొరబాటు లేదని సుప్రీం కోర్టు కితాబునిచ్చింది. అది విఫలమైంది గనక సిబిఐకి దర్యాప్తు అప్పగించాలనే అభ్యర్థనను తోసిపుచ్చుతూ అది అరుదైన సందర్భాల్లో మాత్రమే సాధ్యమని చెప్పడం మరింత విపరీతమైన అంశం. దీనికి సిజెఐ అనేక వాదనలు తెచ్చారు గాని ఎన్ని రాజకీయ వాజ్యాలలో సిబిఐని, ఎన్‌ఐఎను తీసుకొచ్చారో దేశమంతటికీ తెలుసు. నిజానికి సుప్రీంకోర్టు సమయంలో సింహ భాగం దానికే సరిపోతున్నది. కంపెనీల షార్ట్ సెల్లింగ్‌పై సెబీ నిబంధనలను తాము నియంత్రించలేమని కూడా చేతులెత్తేసింది. చాలా కాలంగా ఈ విషయంలో పాటిస్తున్న నియంత్రణను కొంతకాలం కిందట మార్చినట్టు వాదించిన సెబీ సమర్థనను ఈ విధంగా సుప్రీం తీర్పు కూడా ఆమోదించింది. అదానీ గ్రూపుపై విస్తారమైన పరిశోధనల సమాచారం, నివేదికలు అందుబాటులో వున్నా సెబీ వాటిని ఉపయోగించుకోలేక పోయిందని తాను నియమించిన కమిటీయే చెప్పినా ధర్మాసనం పట్టించుకోలేదు. పైగా వీరంతా చట్టబద్ధమైన సెబీ నియంత్రణ సంస్థగా విచారిస్తుంటే థర్డ్ పార్టీ (బయిటివారని) ఎందుకని ప్రశ్నించింది. పత్రికల్లో మీడియాలో వచ్చిన నివేదికలను, కథనాలను పరిగణనలోకి తీసుకోనవసరం లేదని ఎదురు వాదించింది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ పేపర్స్ (ఒసిసిఆర్‌పి) విడుదల చేసిన నివేదికను పిల్‌లో ప్రస్తావించడాన్ని తోసిపుచ్చింది. ఇది సహజ న్యాయ సూత్రాలకే విరుద్ధమని చెప్పనక్కర్లేదు. సెబీ అనుసరించిన పద్ధతులు, సూత్రాలు సరైనవా కావా అని చెప్పడం తన పరిధిలో వుండదని కూడా వ్యాఖ్యానించింది. అదానీ వ్యవహారాలను గతంలో ఎన్నడూ తాను దర్యాప్తు చేసిందేలేదని సెబీ తన వాంగ్మూలంలో చెప్పడం ఇక్కడ అతి పెద్ద పిల్లి మొగ్గ. మరోపక్క షార్ట్ సెల్లింగ్‌ను స్టాక్ మార్కెట్ లావాదేవీలను నియంత్రణ చేయడం కోసం తాము భవిష్యత్తులో చర్య తీసుకుంటామని కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ ఇచ్చిన హామీని ఓకె చేసింది.

న్యూస్ క్లిక్ కేసులో ఏమైంది?

తీర్పు రాగానే సత్యం గెలిచిందని అదానీ గొప్పగా స్వాగతించారు. ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. పరస్పర విరుద్ధాంశాలను ఎత్తిచూపుతూ కాంగ్రెస్ ప్రతినిధి జైరాం రమేష్ ఒక సమగ్ర ప్రకటన చేశారు. ఈ తీర్పు చాలా నిరుత్సాహ కరమని సిపిఎం పేర్కొంది. ప్రభుత్వం అన్నిటినీ కప్పిపుచ్చడానికి సుప్రీం తీర్పు లైసెన్సుగా మారిందని కూడా సిపిఎం విమర్శించింది. తమాషా ఏమంటే వివరాలు తప్పక వెల్లడించాలని తీర్పు వచ్చిన రెండు రోజుల్లోనే షార్ట్ సెల్లింగ్ నిబంధనలు సెబీ సవరించింది! అదానీని కాపాడే ప్రక్రియ అయిపోగానే వాటి అవసరం తీరిపోయిందన్నమాట. మోడీ రాజ్యంలో సమస్త వ్యవస్థలూ శక్తులూ కూడా అదానీని కాపాడ్డానికే అంకితమైన తీరు ఇది. న్యూస్‌క్లిక్‌పై కేంద్రం దాడికి కారణం నైవేలీ సింఘం ద్వారా దానికి మూడు కోట్ల రూపాయలు అందాయనే ఆరోపణ. వాస్తవానికి అవి చట్టబద్ధంగా జరిగిన లావాదేవీలు. కానీ దాన్ని పెద్ద వ్యవహారంగా చేసి ప్రబీర్ పురకాయస్థ తదితరులను నెలల తరబడి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. ఇప్పటికీ వేధిస్తూనే వున్నారు. మీడియాపై అదానీ పట్టు అంతులేకుండా పెరిగిపోతున్న స్థితి కూడా చూస్తున్నాం. 17 లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యం అక్రమాలను అంతర్జాతీయ సమాజం లోతులు చూపుతున్నా దాటేస్తున్న ఈ సర్కారు న్యూస్‌క్లిక్ విషయంలో మన దర్యాప్తు సంస్థల సమాచారాన్నే మరో రూపంలో ఇచ్చిన న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ఆధారంగా చూపుతుంది. కానీ అదానీకి సంబంధించిన వేల కోట్ల స్టాక్ భాగోతాలలో మనీలాండరింగ్‌లలో మాత్రం పత్రికల కథనాలపై ఆధారపడలేమని అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెబుతుంది. తలకిందులు తర్కం అంటే ఇదే కదూ?

★

విశ్లేషణ



వి. రాంభూపాల్

అంగన్‌వాడీలపై 'ఎస్మా' అప్రజాస్వామికం

పాలకులందరూ ఒక చెట్టు కర్రలే. ఆ కర్రలతో వాయించడమే వారికి తెలిసిన విద్య. కాకపోతే ఒకొకసారి సన్నాయి వాయించి, అసలు సమయం వచ్చినప్పుడు ప్రజల వీపులు వాయిస్తారు. అన్ని ముసుగులు ఉద్యమాల కాలంలోనే తొలగిపోతాయి. బాంధవుళ్లు అన్న నోళ్లే ఒళ్ళు బలిసిందా అని ఫీంకరిస్తారు. సమ్మెలు ఆపుతారా, అణచివేయమంటారా అని గాండ్రిస్తారు. ఉడత ఊపులకే ఉద్యమాలు భయపడితే ఈ మాత్రం స్వేచ్ఛ, ఈ మాత్రం హక్కులు శ్రమజీవులకు దక్కేవి కాదన్నది చరిత్ర చెబుతున్న సత్యం.

ఇందిరమ్మ కాలం నాటి 'ఎస్మా' చట్టం ఈ అన్న రాజ్యంలో మరోసారి ఆంధ్ర రాష్ట్రంలో అమలులోకి వచ్చింది. దేశ చరిత్రలో అత్యంత భయానక చీకటి రోజులుగా నిలవడానికి కారణమై, చెత్తబుట్టలో మూలుగుతున్న 'ఎస్మా' చట్టాన్ని ముఖ్యమంత్రి మరోసారి బూజుదులిపి అంగన్‌వాడీలపై ప్రయోగించి నాటి రోత చరితకు వారసుడుగా నిలవదలిచారా! 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై 'ఎస్మా' (అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం) ఆయుధాన్ని జీవో నెంబర్ 2 ద్వారా ఉపయోగించడం ఎవరిని సంతృప్తి పరచడానికి? ఏం సాధించడానికి? బ్రహ్మాస్త్రం ఉందో లేదో తెలియదు, ఒకవైళ ఉంటే పిచుకుల మీద ప్రయోగిస్తే ఏం జరుగుతుందో కూడా మనకు తెలియదు. కాని బలమైన సర్పం చలి చీమల చేత చిక్కి చావడం మాత్రం నిత్య అనుభవమే. పాలకుల అణచివేత ఉన్నచోటల్లా ఉద్యమ కెరటాలు లేస్తూనే ఉంటాయి. ఇది చరిత్ర నేర్పుతున్న సత్యం. అధికార మదాంధకారంలో విర్రవీగిన నేతలకు చరిత్రలో ఏ గతి పట్టిందో ఎస్మా పాలకులు గుర్తుంచుకోవాలి.

కనీస వేతనం ఇవ్వండి, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించండి అని ఇన్నేళ్ళుగా అంగన్‌వాడీలు అడుగుతుంటే...'మీ సేవ స్వచ్ఛందం' అని చెప్పిన పాలకులకు 25 రోజుల సమ్మె తర్వాత వీరి సేవ అత్యవసరం అని గుర్తుకు వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు కాని స్వచ్ఛంద సేవకులమైన మా మీద ఎస్మా ఎలా ప్రయోగిస్తారు అని అంగన్‌వాడీ కార్మికులు అడుగుతున్న ప్రశ్నకు ఇప్పుడు పాలకులు జవాబు చెప్పాలి. తనను అన్యాయంగా, అక్రమంగా జైల్లో పెట్టారని సానుభూతి పవనాల కోసం నిత్యం పరితపించే ముఖ్యమంత్రి నేడు అంగన్‌వాడీల మీద ఎస్మా పెట్టడం ఏం న్యాయమో, ఏం సక్రమమో ఆంధ్ర ప్రజలకు చెప్పాలి. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ఉపయోగించిన రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను నిషేధించడంతో పాటు వారి వేతనాలకు కోత కోసింది.

అంగన్‌వాడీల సమ్మె ఎందుకు?

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో సుప్రీంకోర్టు చెప్పింది. అంగన్‌వాడీల నియామకంలో కాంట్రాక్టర్లు, ఏజెంట్ల లాంటి మధ్యవర్తులు ఎవరూ లేరు. ప్రభుత్వమే నియమిస్తుంది. ప్రభుత్వమే పని చేయించు కుంటుంది. అందువల్ల సుప్రీంకోర్టు తీర్పు వీరికి వర్తిస్తుంది. దీని ప్రకారం రెగ్యులర్ ఉద్యోగుల్లో చిట్టచివరన ఉన్న వారికి చెల్లించే కనీస వేతనం, డి.ఎ, ఇతర అలవెన్స్‌లు కలిపి రూ. 26 వేలు ఇవ్వాలి. వాస్తవంగా కార్మికులకు పి.ఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. ఇవి ఏపీ అంగన్‌వాడీలకు అమలు కావడంలేదు. అయినా నేడు అంగన్‌వాడీలు అడుగుతున్నదేమిటి? తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీలకు ఇచ్చే వేతనం కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇవ్వమని. ఇలా ఇస్తామని ఎవరు చెప్పారు? స్వయానా నేటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చెప్పి నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలలు పూర్తయింది. ప్రస్తుతం తెలంగాణలో ఇస్తున్న వేతనాల కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇవ్వమని వారు అడుగుతున్నారు. అలా కాదు. మేము అధికారంలోకి వచ్చిన నాటికి ఎంత వేతనం ఉంటే దానిపై వెయ్యి ఇస్తామన్నామని మంత్రి గారు సెలవిస్తున్నారు.



> **కనీస వేతనం ఇవ్వండి, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించండి అని ఇన్నేళ్ళుగా అంగన్‌వాడీలు అడుగుతుంటే... 'మీ సేవ స్వచ్ఛందం' అని చెప్పిన పాలకులకు 25 రోజుల సమ్మె తర్వాత వీరి సేవ అత్యవసరం అని గుర్తుకు వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు కాని స్వచ్ఛంద సేవకులమైన మా మీద ఎస్మా ఎలా ప్రయోగిస్తారు అని అంగన్‌వాడీ కార్మికులు అడుగుతున్న ప్రశ్నకు ఇప్పుడు పాలకులు జవాబు చెప్పాలి. తనను అన్యాయంగా, అక్రమంగా జైల్లో పెట్టారని సానుభూతి పవనాల కోసం నిత్యం పరితపించే ముఖ్యమంత్రి నేడు అంగన్‌వాడీల మీద ఎస్మా పెట్టడం ఏం న్యాయమో, ఏం సక్రమమో రాష్ట్ర ప్రజలకు చెప్పాలి.**

అలాగేకాని, మీరు అధికారంలోకి వచ్చిన నాడు సరుకుల ధరలు, ఇంటి బాడుగలు, బస్సు చార్జీలు, పిల్లల చదువుల ఫీజులు, ఆసుపత్రుల వైద్యం ఫీజులు ఎంత ఉంటే అంతకే ఇవ్వండి. వేతనం పెంచమని మేము అడగమని అంగన్‌వాడీలు అంటున్నారు. ఇప్పుడు చెప్పండి మాట తప్పింది ఎవరు? మడమ తిప్పింది ఎవరు?

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు, అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులు అమలు చేయమని అడిగినా...చట్టబద్ధంగా, అత్యంత ప్రజాస్వామిక పద్ధతుల్లో విజ్ఞప్తులు, ఆందోళనలు చేసినా...చలించక, అనివార్యంగా సమ్మె చేసే పరిస్థితులను సృష్టించిన పాలకులు నేడు అంగన్‌వాడీలను నేరస్థులుగా చూస్తారా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీల ఉద్యమాలను బలపరచిన పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అణచివేయాలని చూడడం పాలకుల ద్వంద్వనీతికి నిదర్శనం.

'ఎస్మా' చట్టం అంటే?

'ఎస్మా' అనేది భారత పార్లమెంట్ చట్టం. అత్యవసర సేవలకు అంతరాయం కలుగకుండా కేంద్రం లేదా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక సందర్భాల్లో అమలు చేయడానికి రూపొందించుకున్న చట్టం ఇది. పేరుకు ఏం చెప్పినా సమ్మెలను, కార్మిక ఉద్యమాలను అణచివేయడానికి పాలకులు తయారు చేసుకున్న అస్త్రం ఇది. 1968లో రూపొందించబడిన ఈ చట్టం 1971, 1981, 1985, 1990, 2013లలో పలు మార్పులు చేయబడింది. ఈ చట్టం ప్రకారం నిర్దేశించన రంగం లేదా ప్రాంతంలో కనీసం ఆరు నెలల పాటు సమ్మెలు చేయడానికి వీలుండదు. ఒకవేళ సమ్మె చేస్తే వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చు. సమ్మెలో పాల్గొంటున్న వారితో పాటు, వారిని ప్రోత్సహించారనే పేరుతో ఎవరినైనా నిర్బంధించవచ్చు. తనకు దేశంలో ఎదురు లేదని భావించిన ఇందిరా గాంధీ సర్కారు 1971లో ఈ చట్టాన్ని ఉపయోగించి 16 సంస్థల్లో కార్మికుల సమ్మెలను నిషేధించింది. రైల్వే కార్మికులపై ఎస్మా, నాసా చట్టాలను ప్రయోగించి వారి సమ్మెను క్రూరంగా అణచివేయాలని చూసింది. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు పెరగడంతో దేశం మొత్తం ఎమర్జెన్సీని విధించింది. నియంతగా వ్యవహరించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆమె పార్టీనే కాదు, ఆమె కూడా ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఆనాడు పోరాడిన కార్మికులు కోల్పోయిన హక్కులను, ఉద్యోగాలను తిరిగి సాధించుకొని చరిత్రలో నిలిచిపోయారు. మన రాష్ట్రంలో కూడా విద్యుత్, ఆర్టీసీ కార్మికులు సమ్మెలు చేసిన సమయంలో నాటి ప్రభుత్వం ఈ ఎస్మాను ప్రయోగించింది. పోలీసుల ద్వారా సమ్మె శిబిరాలను తొలగించింది. ప్రదర్శనలను నిషేధించింది. చివరకు కార్మిక ఉద్యమానికి తలొంచి చర్చలు జరిపి ఆయా రంగాల కార్మికుల డిమాండ్లను పరిష్కరించాల్సి వచ్చింది. మన జీవిత కాలంలోనే కేంద్రంలో నరేంద్ర మోడీ చారిత్రాత్మకమైన రైతాంగ ఉద్యమాన్ని ఎంతగా అణచిపెట్టాలని చూశారో, ఎన్ని రకాలుగా దుష్ప్రచారం చేశారో చూశాం. చివరకు జరిగింది ఏమిటి, దేశ ప్రజలకు ఆ ప్రధానే క్షమాపణ చెప్పుకోవలసి వచ్చింది. అదే ఉద్యమాల బలం. దాన్ని గుర్తించ నిరాకరిస్తే ఆ పాలకుల గతే ఈ ప్రభుత్వానికీ పడుతుంది.

ఉడత ఊపులతో, తాటాకు చప్పుళ్లతో కార్మిక వర్గాన్ని భయపెట్టి లొంగదీసుకోవాలనుకోవడం పాలకుల దుర్నీతి. పాలకులు ఎవరైనా వారి బుద్ధి కార్మిక, కష్టజీవులను అణచివేయడమే. అందుకు వైసిపి మినహాయింపు కాదని రుజువైంది. నేడు అంగన్‌వాడీలు, రేపు ఎవరైనా ఈ చట్టానికి గురికావలసి వస్తుంది. అందుకే ఎస్మా చట్టం ప్రయోగానికి వ్యతిరేకంగా, తమ డిమాండ్ల సాధనకు పోరాడుతున్న అంగన్‌వాడీ, మున్సిపల్, ఎస్ఎస్ఎ కార్మికులకు అండగా నిలవడం ప్రజాతంత్రవాదులందరి కర్తవ్యం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు మోపాలి

- ఢిల్లీ కోర్టును కోరిన పోలీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో బిజెపి ఎంపి, మాజీ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై అభియోగాలు మోపాలని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టుకు ఢిల్లీ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ప్రియాంక రాజ్‌పుత్‌ను ఢిల్లీ పోలీసులు కోరారు. బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు మోపడానికి సంబంధించి వాదనలు ముగించినందున, ఆరోపించిన సంఘటనలు కొన్ని విదేశాల్లో జరిగినందున, అవి ఢిల్లీలోని కోర్టుల పరిధిలోకి రావన్న నిందితుల వాదనను పోలీసులు వ్యతిరేకించారు. ఢిల్లీతో సహా విదేశాల్లో, దేశంలో బ్రిజ్‌భూషణ్ చేసిన లైంగిక వేధింపుల సంఘటనలు ఒకే నేరంలో భాగమని పోలీసులు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ప్రియాంక ముందు పోలీసు తరపు న్యాయవాది సమర్పించారు. ఈ కేసును విచారించే అధికారం ఢిల్లీ కోర్టుకు ఉంది" అని న్యాయమూర్తికి తెలిపారు. దీనిపై ఈ నెల 20న కోర్టు తదుపరి విచారణ చేపట్టనుంది.

పోలీసుపై చేయిచేసుకున్న బిజెపి ఎమ్మెల్యే

ముంబయి: విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారిపై బిజెపి ఎమ్మెల్యే చేయి చేసుకున్న ఘటన మహారాష్ట్రలో చోటు చేసుకొంది. పుణెలోని సాసూన్ ఆస్పత్రిలో జరిగిన ఓ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వేదిక నుంచి కిందకు దిగుతున్న బిజెపికి చెందిన పుణె కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కాంబ్లే పట్టు కోల్పోయి కిందకు పడబోయారు. పక్కనే విధులు నిర్వర్తిస్తున్న పోలీసు చెంపపై ఆయన కొట్టారు. ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. పోలీసుపై ఆయన చర్యను పలువురు విమర్శిస్తున్నారు. కార్యక్రమానికి ఆహ్వానించే పత్రికలో తన పేరు లేకపోవడమే ఆగ్రహానికి కారణమని.. అందువల్లే సహనం కోల్పోయి ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు.

774 కోవిడ్ కేసులు

- ఇద్దరు మృతి

న్యూఢిల్లీ: భారతదేశంలో ఒకే రోజు 774 కోవిడ్ -19 కేసులు నమోదయ్యాయి, క్రియాశీల కేసుల సంఖ్య 4,187గా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది.. ఉదయం 8 గంటలకు అప్‌డేట్ చేసిన మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, 24 గంటల వ్యవధిలో తమిళనాడు, గుజరాత్‌కు చెందిన ఒక్కొక్కరు మరణించారు. మహమ్మారి ప్రారంభమైనప్పటి నుండి, దేశవ్యాప్తంగా 4.5 కోట్ల మందికి పైగా ప్రజలకు సోగా, 5.3 లక్షల మందికి పైగా మరణించారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సెలవుల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి తిరిగి వచ్చిన ప్రజలు తప్పనిసరిగా ఐదు రోజులు ఇంట్లోనే ఐసొలేషన్‌లో ఉండాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వడగండ్లు

న్యూఢిల్లీ: రాగల మూడు, నాలుగు రోజులపాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వడగండ్ల వాన పడే అవకాశం ఉన్నదని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. తమిళనాడు, కేరళ, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్ తీరాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతోపాటు, అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉన్నదని ఐఎండి తెలిపింది.

ఆదిత్య ఎల్ -1 సక్సెస్!

- లాగ్రాంజ్ పాయింట్‌కు అంతరిక్ష నౌక
- రాష్ట్రపతి, ప్రధాని, సిఎం సహా పలువురు అభినందనలు



సెప్టెంబరు 2న శ్రీహరికోట నుంచి ఇస్రో ఆదిత్య ఎల్-1 ను ప్రయోగిస్తున్న దృశ్యం (ఫైల్)

బెంగళూరు : సూర్యునిపై అధ్యయనం చేసేందుకు ఇస్రో పంపించిన ఆదిత్య ఎల్-1 అంతరిక్ష నౌక ఎట్టకేలకు లాగ్రాంజ్ పాయింట్ (ఎల్ 1) సమీపాన గల హాలో కక్ష్యలోకి శనివారం విజయవంతంగా చేరుకుంది. గతేడాది సెప్టెంబరు 2న శ్రీహరికోట నుంచి ఇస్రో దీన్ని ప్రయోగించగా, 127 రోజుల్లో దాదాపు 15లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన ఆదిత్య శనివారం తన నిర్దేశిత స్థానాన్ని చేరుకుంది. భూమి నుంచి ఎల్-1 మధ్య దూరం, భూమి-సూర్యుని మధ్య దూరంలో దాదాపు ఒక శాతం వుంటుంది. ఆదిత్య గమ్య స్థానం చేరుకోవడానికి ముందుగా ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు చేపట్టిన ఫైరింగ్ విన్యాసం విజయవంతమై అనుకున్నట్లుగా కక్ష్యలోకి ఆదిత్య చేరుకుంది. శనివారం సాయంత్రం 4గంటలకు ఈ ప్రక్రియ పూర్తయినట్లు ఇస్రో ప్రకటించింది. సౌర వాతావరణాన్ని లోతుగా, కూలంకుషంగా అధ్యయనం చేయడం 'ఆదిత్య ఎల్-1 లక్ష్యంగా వుంది. సూర్యుడిపై పరిశోధనలు జరిపేందుకు ఇస్రో చేపట్టిన తొలి మిషన్ ఇదే. ఈ అంతరిక్ష నౌక మొత్తంగా ఏడు పేలోడ్లను తీసుకెళ్లింది. ఎలక్ట్రోమాగ్నటిక్, పార్టికల్ డిటెక్టర్లను ఉపయోగించి సౌర వాతావరణం, సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్ తదితర విషయాలపై అధ్యయనం జరపనున్నారు. ఎల్-1 పాయింట్ నుండి ఆదిత్య ఉపగ్రహం ఎలాంటి అడ్డంకులు, ఆటంకాలు లేకుండా సూర్యుడిని నిరంతరంగా వీక్షిస్తూ పరిశోధనలు జరుపుతుంది. ఐదేళ్లపాటు పనిచేసేలా ఈ మిషన్‌ను రూపొందించారు.

రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల అభినందనలు


ఆదిత్య ఎల్-1 ప్రయోగం విజయవంతం కావడానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతులు అభినందించారు. ఇస్రో మరో ఘన విజయాన్ని అందుకుంది. ఈ ఘనత సాధించిన శాస్త్రవేత్తలకు అభినందనలు. ఈ మిషన్‌తో మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన అభినందన సందేశంలో పేర్కొన్నారు. భారత్ మరో అరుదైన ఘనత సాధించిందని ప్రధాని మోడీ ఎక్స్‌లో వెల్లడించారు. "అత్యంత సంక్లిష్టమైన అంతరిక్ష యాత్రల్లో మన శాస్త్రవేత్తల అంకితభావానికి ఇది నిదర్శనమన్నారు. ఈ అద్భుత విజయం సాధించిన శాస్త్రవేత్తలకు అభినందనలు. మానవాళి ప్రయోజనాల కోసం శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త శిఖరాలకు చేరుకునే మన ప్రయాణం కొనసాగుతుంది" అని మోదీ ఎక్స్‌లో పెట్టిన పోస్టులో పేర్కొన్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి జితేంద్రసింగ్ మాట్లాడుతూ, "మూన్ వాక్ నుంచి సన్ డ్యాన్స్ వరకు..! ఆదిత్య-ఎల్1 తుది కక్ష్యలోకి చేరుకుంది. ఇస్రోకు అభినందనలు" అని ప్రశంసించారు.

ముఖ్యమంత్రి జగన్ హర్షం

అంతరిక్ష సాంకేతికతలో చివరి కక్ష్య స్క్రిప్టింగ్ చరిత్రకు చేరిన ఆదిత్యఎల్-1 విజయం సాధించడం పట్ల సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అద్భుత విజయం సాధించినందుకు ఇస్రో శాస్త్రవేత్తల బృందాన్ని ఆయన అభినందించారు. రాబోవు రోజుల్లో ఇస్రో మరెన్నో విజయాలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.

ఏడేళ్ల కనిష్టానికి స్టార్టప్ నిధులు

- గతేడాది 73 శాతం పతనం



న్యూఢిల్లీ : భారతీయ స్టార్టప్‌లు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. మోడి ప్రభుత్వానికి కార్పొరేట్లకు వేల కోట్ల రుణాలు ఇప్పించడంలో ఉన్న ఆసక్తి.. చిన్న సంస్థలకు నిధుల మద్దతు అందించడంలో లేదని స్పష్టమవుతోంది. గతేడాది డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టార్టప్‌ల నిధుల సమీకరణ ఏడేళ్ల కనిష్టానికి పడిపోయాయి. 2016 మూడో త్రైమాసికం నాటి స్థాయికి నిధుల లభ్యత తగ్గింది. గడిచిన త్రైమాసికంలో కొత్త వెంచర్ స్టార్టప్‌లు అత్యల్ప ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్‌లతో తీవ్ర ఆందోళన పరిస్థితులను ఎదుర్కొన్నాయని ట్రాక్సన్ రీసెర్చ్ వేదిక పేర్కొంది. భారత్‌లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, బ్రిటన్, చైనా, సౌత్ ఈస్ట్ ఏసియా దేశాల్లోనూ స్టార్టప్‌లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. 2023లో భారతీయ స్టార్టప్‌లు నిధుల సమీకరణలో దాదాపు 73 శాతం క్షీణతను చవిచూశాయి. అంతకుముందు సంవత్సరంలో 25 బిలియన్లతో పోలిస్తే గతేడాది ఏడు బిలియన్లను సేకరించాయి. 2022 నుంచి స్టార్టప్‌లు నిధుల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఫిన్‌టెక్, రిటైల్, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్లు, ఎన్విరాన్‌మెంట్ టెక్, స్పేస్ టెక్ రంగాల స్టార్టప్‌లు ఎక్కువ నిధులు సమీకరించగలిగాయి. గతేడాది ఫిన్‌టెక్ రంగం 2.8 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించగా.. అంతక్రితం ఏడాది 5.8 బిలియన్ డాలర్లను పొందాయి. 2023లో రిటైల్ రంగం స్టార్టప్‌లు 67 శాతం పతనంతో 1.9 బిలియన్ డాలర్ల నిధులను అందుకున్నాయి.

జమిలి ఎన్నికలపై 15లోగా సూచనలివ్వండి

- ఆ తరువాతవి పరిగణించం
- ప్రజలకు రామ్‌నాథ్ కోవింద్ కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఒకే దేశం - ఒకే ఎన్నిక'పై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్రం ఏర్పాటుచేసిన కమిటీ ప్రజల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానించింది. దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించేలా.. ప్రస్తుతం ఉన్న చట్టపరమైన అడ్మినిస్ట్రేటివ్ ఫ్రేమ్‌వర్క్‌లో తగిన మార్పులను సూచించాలని కోవింద్ కమిటీ శనివారం ఓ ప్రకటనలో కోరింది. ఈ నెల 15 నాటికి అందిన సూచనలనే పరిగణనలోకి తీసుకుంటామని కమిటీ తెలిపింది. ఈ సూచనలను కమిటీ వెబ్‌సైట్ శీఅశీవ.ప్త్రశీజ.ఱఅలో పోస్ట్ చేయాలని లేదంటే ంఎ-ష్త్రశ్రీఎఎస్త్రశీజ.ఱఅ ఐడికి ఈ-మెయిల్ చేయాలని తెలిపింది. ఒకే దేశం- ఒకే ఎన్నిక కోసం గతేడాది సెప్టెంబరులో ఈ కమిటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి రెండుసార్లు సమావేశాలు నిర్వహించింది. ఇటీవల రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాలు కోరింది. జమిలి ఎన్నికలపై న్యాయ కమిషన్ నుంచి కూడా సలహాలు తీసుకుంది. న్యాయ కమిషన్‌తో మళ్లీ చర్చించే అవకాశం ఉంది.

పార్లమెంటులో నోరు నొక్కేస్తున్నారు

- కాంగ్రెస్ నేత ఖర్గే
- 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' లోగో ఆవిష్కరణ



'భారత్ జోడో న్యాయ్ యాత్ర' లోగో ఆవిష్కరిస్తున్న ఖర్గే, జైరామ్ రమేష్, వేణుగోపాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో ప్రజా సమస్యలను లేవనెత్తడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వనందునే తమ పార్టీ 'భారత్ జోడో న్యాయ యాత్ర'ను చేపడుతున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. ఎఐసిసి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ నెల 14 నుంచి చేపడుతున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' 'న్యాయ్ కా హక్ మిల్నే తక్' లోగోతోపాటు నినాదాన్ని ఖర్గే, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ఈ యాత్ర దేశంలోని ప్రాథమిక సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై దృష్టి పెడుతుందని చెప్పారు. ఇండియా ఫోరం నాయకులు, పౌర సమాజ సభ్యులను కూడా మార్చ్‌లో పాల్గొనడానికి ఆహ్వానించామని ఆయన తెలిపారు. కన్యా కుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర విజయవంతమైందని గుర్తు చేశారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర మణిపూర్‌లోని ఇంఫాల్ నుంచి ప్రారంభమై ముంబయిలో ముగుస్తుందన్నారు. "పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడానికి ప్రభుత్వం మాకు అవకాశం ఇవ్వలేదు. అందుకే కాంగ్రెస్ భారత్ జోడో న్యాయ్ యాత్రను చేపడుతోంది. మేము ఈ వేదిక (యాత్ర) ద్వారా ప్రజల సమస్యలను వింటాము" అని ఖర్గే అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను బెదిరించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ వంటి ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. కొత్త కార్మిక చట్టాలు, క్రిమినల్ చట్టాలు నియంతృత్వ సంకేతాలను చూపుతున్నాయని ఖర్గే అన్నారు. మణిపూర్‌లో ఘటనలు దురదృష్టకరమని చెప్పారు.

ఈ గొప్పవ్యక్తి మణిపూర్ మాత్రం వెళ్లరు

"బీచ్‌లకు వెళ్తారు. ఫోటో సెషన్ స్ట్రీమింగ్ నడుస్తుంది. ఆలయ నిర్మాణ ప్రాంతంలో ఫొటోలు దిగుతారు. కేరళ, ముంబాయి వెళ్తారు. వెళ్లిన ప్రతిచోటా ఫోటోలు దిగుతూనే ఉంటారు. ఈ గొప్ప వ్యక్తి మణిపూర్‌కు మాత్రం వెళ్లరు" అంటూ ప్రధాని మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 22న రామ మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందిందని, త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఇండియా ఫోరం కన్వీనర్‌పై మీడియా అడిగిన ప్రశ్నకు....'ఇది కౌన్ బనేగా కరోడ్‌పతి ప్రశ్న' అంటూ ఆయన నవ్వుతూ చమత్కరించారు. కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ, తమకు ప్రజల వద్దకు వెళ్లడం మినహా మార్గం లేదనే విషయం ప్రజలకు ఈ యాత్ర ద్వారా తెలియజేస్తామన్నారు. పార్లమెంటులో పలు అంశాలను లేవనెత్తాలని ప్రయత్నించినప్పటికీ తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు 146 మంది ప్రతిపక్ష ఎంపిలను పార్లమెంట్ నుంచి గెంటివేసిందని అన్నారు.

భారత్ జోడో న్యాయ్ యాత్ర ఈ నెల 14 న ప్రారంభమై 6,713 కి.మీ మేర సాగి, మార్చి20న ముంబయిలో ముగుస్తుంది. 66 రోజులపాటు మొత్తం 15 రాష్ట్రాలు, 110 జిల్లాలు, వంద లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాలను ఇది కవర్ చేస్తుంది.



బర్ద్వాన్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మహారాణి కోనార్ భౌతికకాయం పై అరుణ పతాకాన్ని ఉంచుతున్న నేతలు

మహారాణి కోనార్ కన్నుమూత

- బర్ద్వాన్ మెడికల్ కాలేజీకి భౌతిక కాయం అందజేత

న్యూఢిల్లీ : ప్రముఖ కమ్యూనిస్టు నేత, అంగన్‌వాడీల సమాఖ్య వ్యవస్థాపక నేత మహారాణి కోనార్ శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లోని బర్ద్వాన్‌లో కన్నుమూశారు. ఆమె వయసు 90సంవత్సరాలు. 1933 నవంబరు 23న జన్మించిన మహారాణి కోనార్ 1958లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. బర్ద్వాన్ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ, వామపక్ష ఉద్యమాన్ని నిర్మించడంలో చురుకైన పాత్ర పోషించారు. బెంగాల్‌లో ఐద్వా కీలక నేతల్లో ఆమె ఒకరు. కిసాన్ ఉద్యమ నేత బినయ్ కోనార్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నేత హరే కృష్ణ కోనార్ ఆమె బావగారు.

బర్ద్వాన్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మహారాణి కోనార్ భౌతిక కాయాన్ని వుంచారు. రాణిదీగా పిలుచుకునే వేలాదిమంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు తమ ప్రియతమ నేతకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె భౌతిక కాయాన్ని బర్ద్వాన్ మెడికల్ కాలేజీ అధికారులకు అందజేశారు.

70వ దశకంలో పశ్చిమ బెంగాల్‌లో నెలకొన్న భయోత్పాత వాతావరణంలో సంఘటిత ప్రజా ప్రతిఘటనకు ఆమె ఒక ఆశాకిరణంగా నిలిచారు. తన ప్రాణాలకు ముప్పు వున్నప్పటికీ లెక్క చేయకుండా ఆమె పార్టీ నేతలకు, కార్యకర్తలకు తన ఇంట్లో ఆశ్రయం కల్పించారు. ఫ్యూడల్ భూస్వాములకు వ్యతిరేకంగా ఎఐకెఎస్ నేతృత్వంలో బర్ద్వాన్ జిల్లాలో ఆమె వీరోచిత రైతాంగ ఉద్యమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను సంఘటితపరచడంలో ఆమె క్రియాశీలంగా పాల్గొన్నారు. ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ వ్యవస్థాపక నేతల్లో ఆమె ఒకరు. పశ్చిమ బెంగాల్‌లో ఐసిడిఎస్ వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలిగా ఆమె సుదీర్ఘకాలం పనిచేశారు. సిఐటియు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కూడా వున్నారు.

సిఐటియు సంతాపం

బెంగాల్‌లో వామపక్ష ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహారాణి కోనార్ మృతికి సిఐటియు తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది. ఆమె మృతికి సంతాప సూచకంగా పార్టీ పతాకాన్ని అవనతం చేసింది. ఆమె చనిపోయే రోజువరకు తన రాజకీయ జీవితంలో క్రియాశీలంగా వ్యవహరించారని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పేర్కొన్నారు. ఒక నెల రోజుల క్రితం ఆమె డివైఎఫ్ఐ పశ్చిమ బెంగాల్ నిర్వహించిన ఇన్సాఫ్ యాత్రలో పాల్గొన్నారు. కార్మికోద్యమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే విషయంలో ఆమె నిరంతరంగా శ్రమించారని, ఆమె ప్రదర్శించిన నిబద్ధత, స్ఫూర్తి, అంకితభావం తరతరాల వరకు గుర్తుండిపోతాయని అన్నారు. ఆమె మృతితో కార్మికోద్యమ భావజాలం పట్ల గట్టి నిబద్ధత కలిగిన ఒక మంచి నేతను కోల్పోయామని పేర్కొన్నారు.

అక్రమ మైనింగ్ కేసులో సిఎం మీడియా సలహాదారుకు ఇడి నోటీసులు

పాట్నా : అక్రమ మైనింగ్ కేసులో ఈ నెల 16న తమ ముందు హాజరు కావాల్సిందిగా జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ పత్రికా సలహాదారు అభిషేక్ ప్రసాద్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శనివారం సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటూ సోరెన్‌కు సన్నిహిత సహచరుడు వినోద్ సింగ్‌ను జనవరి 15న, సాహిబ్‌గంజ్ డిప్యూటీ కమిషనర్ రామ్‌నివాస్ యాదవ్‌ను జనవరి 11న హాజరు కావాల్సిందిగా కోరింది. కటోరియా మాజీ ఎంఎల్ఎ పప్పు యాదవ్‌ను జనవరి 9న ఉదయం 11గంటలకు విచారణ నిమిత్తం హాజరు కావాల్సిందిగా ఇడి ఆదేశాలు జారీ చేసింది. పప్పు యాదవ్‌తో పాటూ మరో ఏడుగురి నివాసాలపై బుధవారం ఇడి ఏకకాలంలో దాడులు జరిపింది. ముఖ్యమంత్రితో గల సంబంధాల కారణంగా వినోద్ సింగ్ ఏడాదిన్నర కాలంగా కేంద్ర దర్యాప్తు సంస్థ దర్యాప్తు పరిధిలో వున్నారు. రామ్‌నివాస్ యాదవ్‌తో వ్యాపార లావాదేవీల కారణంగా మాజీ ఎంఎల్ఎపై ఇడి దృష్టిపెట్టింది. రూ.1250కోట్ల విలువైన ఈ అక్రమ మైనింగ్ కేసులోని అనేక కోణాలు, అంశాలను ఇడి దర్యాప్తు చేస్తోంది. మోడీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఇడి దాడులు నిర్వహిస్తోందని, సమన్లు జారీ చేస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

చిల్డ్రన్స్ హోమ్ నుంచి 26 మంది బాలికల అదృశ్యం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో 26 మంది బాలికలు అదృశ్యమయ్యారు. రాజధాని భోపాల్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఓ అక్రమ షెల్టర్ హోమ్ నుంచి గుజరాత్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 26 మంది బాలికలు కనిపించడం లేదని అధికారులు తెలిపారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ ప్రియాంక్ కనుంగో భోపాల్ శివార్లలోని పర్వాలియా ప్రాంతంలోని ఆంచల్ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రిజిస్టర్‌ని పరిశీలించగా.. అందులో 68 మంది బాలికల పేర్లు ఉండగా.. 26 మంది అక్కడ లేనట్లు గుర్తించారు. అదృశ్యమైన బాలికల గురించి షెల్టర్ హోమ్ డైరెక్టర్ అనిల్ మాథ్యూని ప్రశ్నించగా.. సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆ నెత్తుటి కూడు మాకొద్దు

- పాలస్తీనీయుల పక్షానే మేము
- కేంద్రానికి తేల్చి చెప్పిన భారత నిర్మాణ కార్మికుల సమాఖ్య



ఇజ్రాయిల్‌లో పనుల కోసం వెళ్లేందుకు వేచిచూస్తున్న పాలస్తీనా కార్మికులు

న్యూఢిల్లీ : గాజాలో రక్తపుటేరులు పారిస్తూ, పెద్దయెత్తున మారణ హెూమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్‌లో పనిచేయడానికి మమ్మల్ని పంపిస్తారా? ఆ నెత్తుటి కూడు మాకొద్దు. పాలస్తీనీయుల పక్షానే మేము ఉంటామని భారత నిర్మాణ కార్మికుల సమాఖ్య కేంద్ర ప్రభుత్వానికి శనివారం తేల్చి చెప్పింది. ఇంతవరకు అమెరికా, బ్రిటన్, కొన్ని యూరప్ దేశాల్లోని రక్షణ రంగ పరికరాలు, బాంబులు తయారు చేసే ఫ్యాక్టరీల్లో కార్మికులు, ఇజ్రాయిల్‌కు ఆయుధాలు ఎగుమతి చేసేందుకు ఓడరేవుల్లో కళాసీలు తిరస్కరించడం చూశాము. ఆ స్ఫూర్తి ఇప్పుడు భారత్‌లోనూ వెల్లివిరుస్తోంది. బిజెపి పాలిత రాష్ట్రాలైన హర్యానా, యుపి, గుజరాత్, మధ్య ప్రదేశ్, చత్తీస్ గఢ్‌లలో నిర్మాణ కార్మికరులకు అధిక వేతనాలు ఎరగా వేసి, ఇజ్రాయిల్‌కు తరలించాలని బిజెపి ప్రభుత్వాలు చేసిన యత్నాలకు భవన నిర్మాణ కార్మికులు ఆదిలోనే గట్టి షాక్ ఇచ్చారు. ఇజ్రాయిల్ నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వేలాదిమంది పాలస్తీనా కార్మికులను నెతన్యాహు ప్రభుత్వం తొలగించింది. గాజాకు చెందిన పాలస్తీనా కార్మికుల వర్క్ పర్మిట్లను రద్దు చేసిన ఇజ్రాయిల్ ప్రభుత్వం పాలస్తీనా వర్కర్ల స్థానంలో దాదాపు లక్ష మంది కార్మికులను భారత్ నుండి తీసుకోవడానికి ఇజ్రాయిల్ చర్యలు తీసుకుంటోందని వార్తలు వచ్చాయి.

ఈ మేరకు బిజెపి పాలనలో వున్న రాష్ట్రాల నుండి నిర్మాణ రంగ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపేందుకు చర్యలు తీసుకోవాలంటూ హుకుమ్ జారీ చేసినట్టు వార్తలొచ్చాయి.. హర్యానా ప్రభుత్వం పదివేల మంది కార్మికులను రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన కార్మిక సంఘాలు నవంబరు తొలినాళ్ళలో ఒక ప్రకటన కూడా జారీ చేశాయి. పాలస్తీనా కార్మికులను తొలగించి ఆ స్థానంలో భారత్ నుండి కార్మికులను పంపాలనుకోవడం అనైతికమైన చర్య అంటూ విమర్శించాయి. ఇటువంటి చర్య తీసుకుంటే, పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ఊచకోత చర్యలను సమర్ధించినట్లే అవుతుందని స్పష్టం చేశాయి. భారత ప్రభుత్వం ఇచ్చే కనీస వేతనాల కన్నా అధికంగా 1609 డాలర్ల అధిక నెలవారీ వేతనం ఇస్తామంటూ ఆశ చూపి యుపి నుండి నిర్మాణ రంగ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపేందుకు ప్రయత్నాలు చేపట్టింది. అయితే, ఇక్కడ కీలకమైన అంశం ఏమిటంటే, ఈ వేతనాలేవీ కూడా వెంటనే ఇవ్వరు. కాంట్రాక్టు చివరిలో కార్మికులకు ఇచ్చేలా కాంట్రాక్టు కంపెనీ వద్ద ఈ మొత్తాలను డిపాజిట్ చేస్తారు.

ఈ కాంట్రాక్టు కాల పరిమితి ఏడాది నుండి ఐదేళ్ల మధ్య వుంటుంది. ఇదిలావుండగా, హర్యానా ప్రభుత్వం నుండి కార్మికులను పంపడంపై ప్రకటన రాగానే భారత నిర్మాణ రంగ కార్మికుల సమాఖ్య (సిడబ్ల్యుఎఫ్ఐ) ప్రభుత్వ చర్యలను తీవ్రంగా విమర్శించింది. ఇజ్రాయిల్‌కు ఇలా నిర్మాణ రంగ కార్మికులను పంపడానికి బదులుగా గాజాలో తక్షణ కాల్పుల విరమణ కోసం పిలుపివ్వాల్సిందిగా భారత ప్రభుత్వాన్ని కోరింది. పాలస్తీనా ప్రజల ప్రయోజనాలకు భారత దేశంలోని నిర్మాణ రంగ కార్మికులు, సమాఖ్య కట్టుబడి వున్నారని, వారికి పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారని సిడబ్ల్యుఎఫ్ఐ పేర్కొంది.

ఇజ్రాయిల్ మారణకాండ

- ఖాన్ యూనిస్‌లో ఇంటిపై దాడి : 22మంది పాలస్తీనియన్ల మృతి
- ప్రధాన బాధితులు చిన్నారులేనన్న యునిసెఫ్
- ఇజ్రాయిల్ ఎయిర్‌బేస్ లక్ష్యంగా హిజ్బుల్లా రాకెట్ దాడులు



చిన్నారుల మృతదేహాలను చూపుతున్న పాలస్తీనా వాసులు

గాజా : ఖాన్ యూనిస్ నగరంలోని ఇంటిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడిలో 22మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ నగరం సురక్షిత ప్రాంతమనుకుని ఇక్కడకు తమ కుటుంబం తరలివచ్చిందని, కానీ ఇక్కడ శుక్రవారం రాత్రి జరిగిన దాడిలో తాను మినహా మిగిలిన కుటుంబ సభ్యులంతా మరణించారని 11 ఏళ్ల బాలుడు ఏడుస్తూ మీడియాకు తెలిపాడు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇజ్రాయిల్ బలగాలు దాడులు కొనసాగిస్తున్నాయి. అనేకచోట్ల పాలస్తీనియన్ల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోందని వార్తలందుతున్నాయి. గాజా ప్రాంతం పాలస్తీనియన్లకు మృత్యుకుహరంలా మారిందని ఐక్యరాజ్య సమితి మానవతా కార్యకలాపాల విభాగం చీఫ్ వ్యాఖ్యానించారు. హమస్ డిప్యూటీ నేత అల్ అరౌరి మృతికి కారణమైన ఇజ్రాయిల్ దాడిపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో లెబనాన్ అధికారికంగా ఫిర్యాదు నమోదు చేసింది.

గాజాలో పౌరులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని తక్షణమే ముగించాలని పాలస్తీనా స్వతంత్ర మానవ హక్కుల కేంద్రానికి చెందిన న్యాయవాది బహజత్ అల్ హెలో విజ్ఞప్తి చేశారు. రాఫా నగరం నుంచి ఆయన మాట్లాడుతూ పాలస్తీనియన్లుగా అత్యంత క్లిష్టమైన, బాధాకరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నామన్నారు. 20లక్షల మందికి పైగా ప్రజలు బందీలుగా వున్నారని అన్నారు. ఇజ్రాయిలీ బలగాల విచక్షణారహిత దాడులతో రోజూ చావు అంచుల వరకు వెళుతున్నామని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రపంచం నోరెత్తకుండా మౌనం పాటించడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్‌ను జవాబుదారీ చేసేలా ఒక్క చర్య కూడా తీసుకోవడంలో యావత్ ప్రపంచ దేశాలు విఫలమయ్యాయని అన్నారు.

గాజాలో చిన్నారులందరూ తీవ్రమైన పోషకాహార లోపానికి గురవుతున్నారని, తీవ్ర స్థాయిలో భయకంపితులవుతున్నారని యునిసెఫ్ పేర్కొంది. ప్రస్తుతం నెలకొన్న మానవతా సంక్షోభంలో ప్రధాన బాధితులు చిన్నారులేనని యునిసెఫ్ ప్రతినిధి టెస్ ఇన్‌గ్రామ్ వ్యాఖ్యానించారు.

హమస్ నేతను హత్య చేయడానికి ప్రతిస్పందనగా హిజ్బుల్లా రాకెట్ దాడులకు పాల్పడింది. మెరాన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులకు పాల్పడినట్లు హిజ్బుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 62 రాకెట్లతో ఇజ్రాయిల్ మిలటరీకి కీలకమైన పోస్టును లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగినట్లు ఆ ప్రకటన పేర్కొంది. ఉత్తర ఇజ్రాయిల్‌వ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో వైమానిక దాడులను సూచిస్తూ సైరన్లు మోగాయి.



ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రి యోవ్ గాలంట్, మంత్రి బెనీగాంజ్

ఇజ్రాయిల్ నేతృత్వంలో గాజా పాలనా పగ్గాలు

ఇజ్రాయిల్ రక్షణ మంత్రి

టెల్ అవీవ్ : గాజా ప్రాంతంపై బాంబు దాడులను ముగించిన తర్వాత ఆ ప్రాంతంలో ఏం చేయాలనే ప్రణాళికలను ఇజ్రాయిల్ వెల్లడించింది. 'విజన్ ఫర్ ఫేజ్ త్రీ' పేరుతో రక్షణ మంత్రి యోవ్ గాలంట్ పంచుకున్న పత్రంలో ఈ వివరాలు వున్నాయి. ఈ ప్రణాళికల వివరాలను ఈ వారంలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు యుద్ధ కేబినెట్‌కు అందజేశారు. గాజా స్ట్రిప్ పౌర పాలనా యంత్రాంగాన్ని ఇజ్రాయిల్ మార్గనిర్దేశకత్వంలో పనిచేసే పాలస్తీనా సంస్థకు అందజేయనున్నట్లు ఆ ప్రణాళిక పేర్కొంది. రోజువారీ పాలనా వ్యవహారాలను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. భద్రతా నియంత్రణ ఇజ్రాయిల్ అదుపులో వుంటుంది.

అవసరమైనంత కాలమూ గాజా దక్షిణ ప్రాంతంలో హమాస్‌తో పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉత్తర గాజాలో స్థాయి తగ్గించిన 'కొత్త పోరాట విధానానికి' ఇజ్రాయిల్ బలగాలు ఏ విధంగా మారతాయో గాలంట్ ఆ ప్రణాళికలో వివరించారు. గాజాలో చర్యలు తీసుకునే హక్కును ఇజ్రాయిల్ అట్టిపెట్టుకుంటుంది. అంటే తమకు ఇష్టమైనపుడల్లా బలగాలు వచ్చి వెళ్లే వీలు వుంటుంది.

పాలస్తీనా అథారిటీ ప్రధాని మహ్మద్ షటయె మాట్లాడుతూ, అంతిమంగా ఏర్పాటు చేసే ఏ అమరిక అయినా కూడా 'మొత్తంగా పాలస్తీనాకు రాజకీయ పరిష్కారం అందించేలా వుండాలి' తప్పితే కేవలం గాజాకు పరిష్కారం అందించేలా వుండరాదని స్పష్టం చేశారు. వెస్ట్ బ్యాంక్ నుండి రాజకీయంగా గాజాను వేరు చేయాలని ఇజ్రాయిల్ భావిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. గాజాను అతి త్వరలోనే వీడి ఇజ్రాయిల్ వెళుతుందని తాను భావించడం లేదన్నారు. ఇజ్రాయిల్ ఆక్రమిత ఆర్మీ నేతృత్వంలో తన స్వంత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఇజ్రాయిల్ భావిస్తోందన్నారు. గాజాలో యుద్ధానంతరం చేపట్టే చర్యలు, ప్రణాళికలను వెల్లడించాల్సిందిగా అంతర్జాతీయంగా ఒత్తిడి వస్తున్నా ఇజ్రాయిల్ వెల్లడించకుండా మొండికేస్తోంది.

హేమంతం



వచ్చే హేమంతం
తెచ్చే మంచు మేఘం
పలికే చలిరాగం
గిలిగింతల తాళం

బంతిపూల అందం
ప్రకృతి పరవశం
చామంతుల సోయగం
ఇంతుల ఆనందం

రంగవల్లికల అందం
ఇల్లాలి మనసు భావం
గొబ్బెమ్మల గీతం
పల్లె పడచుల వినోదం

ధనుర్మాస సంబరం
గోదాదేవి స్మరణం
కళ్ళం చేరిన ధాన్యం
రైతింట ఆనందం

- మొర్రి గోపి,
కవిటి,
శ్రీకాకుళం జిల్లా,
88978 82202.

పదాలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న పదాలు పక్కనే ఉన్న బాక్సుల్లో అడ్డదిడ్డంగా ఉన్నాయి. అవి ఎక్కడ ఉన్నాయో చూసి వాటి చుట్టూ వృత్తం చుట్టండి.


sit
boat
moon
tree
berry
chair

u	d	p	w	s	t
r	h	w	d	i	r
i	r	k	p	t	e
a	t	a	o	b	e
h	n	o	o	m	l
c	y	r	r	e	b

నేను గీసిన బొమ్మ



ప్రణీల్ తేజ్,
4వ తరగతి,
సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్,
విశాఖపట్నం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆపన్నులకు అమ్మానాన్నలు

ఆపదలో ఉన్నవారికి మేమున్నాం మీకు అండగా అంటూ అక్కున చేర్చుకుంటోంది విజయవాడలోని నవజీవన్ బాలభవన్ సంస్థ. అమ్మానాన్న ఆదరణకు నోచుకోని వీధిబాలల ఆలనాపాలనా చూస్తోంది. వారి ఆకలిని తీరుస్తూ...విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఈ సంస్థ నీడలో తలదాచుకుంటున్న నిరాశ్రయులు, వీధిబాలలు ఎంతోమంది ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో ఉన్నత ఉద్యోగులుగా స్థిరపడ్డారు. మరికొందరు విదేశాల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారూ ఉన్నారు. తనవారెవ్వరూ లేకపోయినా మీకోసం మేమున్నాం అంటూ నవ జీవన్ సంస్థ ప్రతినిధులు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు. మంచి పౌష్టికాహారం, చక్కటి ఆరోగ్యం, మంచి కుటుంబ వ్యవస్థను సైతం ఏర్పాటుచేస్తున్నారు. జీవితంలో మునుపటిలాంటి విపత్తులు రాకుండా ఎదుర్కొనటానికి అవసరమైన సన్నద్ధతను తెలియజేస్తూ పురోభివృద్ధికోసం పాటుపడుతున్నారు. నవజీవన్ బాలభవన్ సొసైటీ ఎవరి కోసం పనిచేస్తుంది? ఎలా చేస్తుందో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..!!

1986లో ఫాదర్ రాయ్ మొదట్లో తల్లిదండ్రులు లేని వారిని ఆదరించటం ప్రారంభించారు. ఆ తర్వాత ఫాదర్ థామస్ కోషి ఆధ్వర్యంలో 1989లో నవజీవన్ బాలభవన్ పేరిట కార్యక్రమాలు చేపట్టారు. తొలుత నలుగురికి ఆశ్రయం ఇవ్వటంతో ఈ సంస్థ సేవలు మొదలై ఇప్పటివరకు సుమారు 60వేల మంది ఆశ్రయం పొందారు. తల్లిదండ్రులు లేని, వారి ఆదరణకు దూరమైన చిన్నారులు, ఇంటి నుంచి పారిపోయి వచ్చిన వీధి బాలలను అక్కున చేర్చుకుంటోందీ సంస్థ. ఎంతో మంది నేడు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో ఉన్నత ఉద్యోగులుగా స్థిరపడ్డారు. మరికొందరు మెకానిక్‌లుగా, ఎలక్ట్రీషియన్లుగాను, కార్పెంటర్లుగా స్థిరపడినవారూ ఉన్నారు. కొంతమంది వివాహాలు చేసుకుని తమ జీవితాలను హాయిగా గడుపుతున్నారు.

ఓపెన్‌షెల్టర్‌లో ఆశ్రయం

ప్రధానంగా వీధి బాలలు, తల్లిదండ్రులు లేనివారు, బాల కార్మికులు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు, బడి బయట చిన్నారులను గుర్తించి విజయవాడ రైల్వే స్టేషన్‌కు సమీపంలోని నవజీవన్ బాలభవన్ ఓపెన్ షెల్టర్‌లో చేరుస్తారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్లుసి) ద్వారా జువెలెన్ జస్టిక్ యాక్ట్ (జెఎస్‌పి) ప్రకారం అధికారికంగా నవజీవన్ కుటుంబంలోకి చేర్చబడుతున్నారు. వారికి నవజీవనే తల్లిదండ్రులుగా మారి విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. గుంటూరు జిల్లా తాడేపల్లి కరకట్ట ప్రాంతంలో చిగురు బాలల గ్రామం (బాలబాలికలు), మొగ్గ, యువ భవన్, దీప నివాస్ పేరిట నిర్వహిస్తూ బ్రిడ్జ్ కోర్సులు, ఒకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. పోటీ పరీక్షలకు కూడా అవకాశం కల్పించటంతో రైల్వే, బ్యాంక్ తదితర విభాగాల్లో ఉన్నత స్థానాలను సైతం అధిరోహించిన వారు కూడా ఉన్నారు. ఇలాంటి కొందరి గురించి తెలుసుకుందాం.

ఉద్యోగాల్లో రాణిస్తున్నారు

ఓపెన్ షెల్టరులో ఉండి విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిలో చసుచిత్ర, సీపాటి విజయ్‌కుమార్, వినోద్‌కుమార్‌తోపాటు మరికొందరు ఉన్నారు. సుచిత్రకు చిన్నప్పుడే తండ్రి చనిపోయారు. షెల్టర్‌లో చేర్పించటంతో ఆమెకు ఫాదర్ కోశి, బాలశౌరి, ప్రదీప్, పికో జోస్, రత్న, అంతయ్య, తంబి, సుబ్బలక్ష్మి తదితరులు ప్రోత్సహించారు. ప్రస్తుతం ఆమె యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీధుల్లో యాచిస్తూ తిరుగుతున్న సీపాటి విజయ్‌కుమార్‌ను స్థానికులు షెల్టరులో చేర్పించగా బికాం పూర్తిచేసి బ్యాంకు పిఒగా గుంటూరులో ఉద్యోగం చేస్తునారు. వినోద్‌కుమార్‌కు అమ్మానాన్న ఎవ్వరో కూడా తెలియదు. రైళ్లల్లో బోగీల్లో యాచిస్తుండగా షెల్టరుకు పంపారు. ఇక్కడే ఇంజనీరింగ్ పూర్తిచేసి రైల్వే లోకోపైలెట్ ఉద్యోగం పొందారు. ఇక్కడే మరో యువతితో వివాహం చేసి అందులో ఆమెకు కూడా ఉద్యోగం ఇచ్చారు. బిట్రా లావణ్య, ఆమె చెల్లెలు ప్రసన్నలు ఇంజనీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. కె.జ్యోత్స్నకు చిన్నప్పుడు తల్లిదండ్రులు చనిపోవటంతో బంధువులు ఓ ఆర్చరీ అకాడమీలో వదిలేసి వెళ్లిపోయారు. అక్కడ బాలికల వసతిగృహం లేనందున నవజీవన్‌లో చేర్పించారు. 2014లో నేషనల్ ఆర్చరీలో హ్యాట్రిక్ ఛాంపియన్‌గా నిలిచి ప్రెసిడెంట్ అవార్డు ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. బిఎ పూర్తిచేసిన ఆమె చిగురు పాఠశాలకు సిసిఐ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. షెల్టరులో సేదతీరిన ఎందరో పిల్లలు నేడు తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటున్నారు.

-యడవల్లి శ్రీనివాసరావు

యువతకు నైపుణ్య శిక్షణ



నీతోడు మానసిక వికాస కేంద్రం (ఎన్ఐసిసి) ద్వారా 100 ప్రాంతాల్లో కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నాం. విజయవాడ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఓపెన్ షెల్టరు, గుణదలలో దీపా నివాస్, నూజివీడుకు సమీపంలోని పోనసానపల్లిలో 25 ఎకరాలల్లో విముక్తి బోస్కో డీ అడిక్షన్ సెంటర్లు నిర్వహిస్తున్నాం. తెలంగాణా, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన (మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు) ఈ కేంద్రాలకు వచ్చి తమలో ఉన్న చెడు అలవాట్లు పోగొట్టుకుంటున్నారు. ఫ్రీ కౌన్సెలింగ్... ఫ్రీ గా మందులు ఇస్తున్నాం. హెచ్ఐవి బాధిత పిల్లలకు కూడా మంచి విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం. పాఠశాల, కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్న యువతకు నైపుణ్యశిక్షణను సైతం అందజేస్తున్నాం.

-శేఖర్ ప్రోగ్రాం మేనేజర్,
నీతోడు మానసిక వికాస కేంద్రం

ఆపన్నులకు అండగా...



నీ తోడు మానసిక వికాసకేంద్రం ద్వారా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా కౌన్సెలింగ్ ఏర్పాటుచేయించాం. వైద్య సిబ్బంది సహకారంతో మత్తు పదార్థాల భారినపడిన వారికి ఉచితంగా మందులు ఇస్తూ బోస్కో డీ ఆడిక్షన్ సెంటరును నిర్వహిస్తున్నాం. నవజీవన్‌లో ఆశ్రయం పొంది ఉన్నతులుగా ఎదిగిన వారు 'ఫ్రూట్స్ ఆఫ్ నవజీవన్' పేరిన ఓ గ్రూపుగా ఏర్పడి ఏటా సంస్థ వార్షికోత్సవం రోజు సమావేశమై సంస్థకు తమ వంతుగా సాయం అందిస్తుంటారు. బాలల పరిరక్షణ వలయాలు (చైల్డ్ సేఫ్టీ నెట్ (సిఎస్ఎన్)ను ఏర్పాటు చేశాం. పేదలు, నిరుపేదలు, ఎస్సీ, ఎస్టీల్లో బడిఈడు పిల్లలు బడుల్లో ఉండేలా కషిచేస్తూ 150 గ్రామాల్లో ట్యూషన్ పాయింట్లు నిర్వహిస్తున్నాం. గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ సింగ్‌నగర్‌లోని రాజరాజేశ్వరి పేటలో చదువుకోలేని యానాది పిల్లల కోసం షెల్టర్లు నిర్మించి డే స్కూళ్లు సైతం నిర్వహిస్తున్నాం.



-ఫాదర్ నీలం రత్నకుమార్
నవజీవన్ బాలభవన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

రంగవల్లి





మేడిబోయన పవిత్ర,
ఒంగోలు జిల్లా.

15 చుక్కలు 1 వచ్చేవరకు (సరిచుక్క)

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

విశ్వజనీనమైన సంస్కృతి ఏదీ లేదు

- 'ప్రజా సంస్కృతి' పుస్తకావిష్కరణలో రాఘవులు



'ప్రజా సంస్కృతి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విశ్వజనీనమైన సంస్కృతి ఏదీ లేదని, సంస్కృతి అనేది ఆయా ప్రాంతాలకు పరిమితమైన విషయమని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పుస్తక మహోత్సవ్‌లో ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు ప్రచురించిన ఇఎంఎస్ నంబూద్రిపాద్ 'ప్రజా సంస్కృతి' పుస్తకావిష్కరణ శనివారం రాత్రి జరిగింది. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాఘవులు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మన సంస్కృతి గురించి ఇఎంఎస్ నంబూద్రిపాద్ దశాబ్దాల క్రితమే రాశారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో రాజకీయంగా సంస్కృతి గురించి విస్తృతంగా చర్చ జరుగుతోందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, సనాతన ధర్మం గురించి చెప్పే అనేక మంది మేధావులు, సాంస్కృతిక జాతీయవాదం, హైందవ జాతీయ సంస్కృతి గురించి మాట్లాడుతున్నారని తెలిపారు. సంస్కృతి గురించి రెండు రకాలుగా చెప్పొచ్చని, అవి కులీన సంస్కృతి, ప్రజా సంస్కృతి అని వివరించారు. అందరికీ వర్తించే విధంగా విశ్వజనీన సంస్కృతి ఉందనేది వాస్తవం కాదన్నారు. అది ఒక్కో చోట ఒక్కో విధంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ కార్మికులు పొలం పనులు చేసే సమయంలో హైలెస్సా అనే పాటలు పాడుతారని, ఇది ఒక సంస్కృతి అన్నారు. ఇటీవల కాలంలో రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం దేశమంతా ఒకే సంస్కృతి అనే వాదాన్ని ప్రచారంలోకి తెస్తున్నారని తెలిపారు. సంస్కృతిని వ్యాపారాత్మకం చేయడం ఎక్కువైందని అన్నారు. కళలను, సంస్కృతులను ప్రజల కోసం వినియోగించే పరిస్థితులు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాచీన విలువలేవైనా వాటిని విమర్శనాత్మకంగా చూసి అనువైనవి స్వీకరించాలని సూచించారు. వేద ధర్మం, సనాతన ధర్మం ఒక్కటి కాదన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి కె.సత్యరంజన్ ఈ పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఇఎంఎస్ నంబూద్రిపాద్ సంస్కృతి గురించి ఎన్నో వ్యాసాలు రాశారన్నారు. సమాజం మారినప్పుడల్లా సంస్కృతి కూడా మారుతుందని తెలిపారు. సంస్కృతిలో మార్పులెలా జరుగుతాయనేది ఈ పుస్తకంలో ఉందన్నారు. అనంతరం ఆయన "ప్రపంచీకరణ స్వేచ్ఛ కుదింపు' పుస్తకాన్ని పరిచ యం చేశారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ విజ్ఞానం గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేసే విధంగా రూపొందించిన ప్రత్యేక సిడిని ప్రముఖ కవి, సాహితీ వేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన పాటకు గల చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో కవి, రచయిత కె.దేవేంద్ర, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరధ్యక్షులు బి.బాబ్జి, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు మనోహర్‌నాయుడు, కె.లక్ష్మయ్య, పిఎన్ఎం రాష్ట్ర నాయకులు జి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమస్యను ఎదుర్కొనే ధైర్యమే ఆత్మవిశ్వాసం

- అనంతపురం జెఎన్‌టియు 13వ స్నాతకోత్సంలో గవర్నర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఆత్మవిశ్వాసం అన్నింటిలోనూ విజయాన్ని అందివ్వకపోవచ్చు... అయితే సమస్యలను ఎదుర్కొనే మనోధైర్యాన్ని స్తుంది' అని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. అనంతపురం జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో జరిగిన ఈ స్నాతకోత్సవంలో 2020-21, 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసరు కె.బాలవీరారెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో హాజరవ్వగా, ఢిల్లీ ఐఐటి మాజీ డైరెక్టరు ప్రొఫెసరు విఘ్నేశ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. విద్య అన్నది సమాచార సంగ్రహణకే కాదని, 21 శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనే ఆలోచన విధానముండా లని సూచించారు. 'గొడుగు వర్షాన్ని ఆపలేదు...కాని వర్షంలో నిలబడేందుకు ఉపయోగపడుతుంది. ఆత్మవిశ్వాసం కూడా అన్నింటిలోనూ విజయాన్ని అందివ్వకపోవచ్చు కాని, సవాళ్లను ఎదుర్కొనే మనోధైర్యాన్ని ఇస్తుంది ' అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేసిన వ్యాఖ్యాలను ఈ సందర్భంగా ఉటంకించారు.

విద్యార్థులు కూడా విజయాన్ని సాధించడం ఒక్కటే కాదు...సవాళ్లను ఎదుర్కొనే మనోధైర్యం కలిగి ఉండాలని సూచించారు. వి.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ.. విజ్ఞానమంటే కేవలం కంప్యూటరు విద్య మాత్రమే కాదని అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో సివిల్ , మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ అన్ని విభాగాలు సమానాభివృద్ధి జరగాల్సి ఉందని సూచించారు. ఈ సందర్భంగా 71 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 68,963 మందికి బ్యాచ్‌లర్ డిగ్రీ, 16914 మందికి ప్రొస్టుగ్రాడ్యుయేషన్, 265 మందికి పిహెచ్‌డి ప్రదానం చేశారు. స్నాతకోత్సవం అనంతరం విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన పరిపాలనా భవనాన్ని గవర్నర్ మీట నొక్కి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ ఛాన్సలర్ రంగ జనార్ధన్, రెక్టార్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వర్సిటీ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి
రచయిత కె దేవేంద్ర రూ.లక్ష విరాళం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ సున్నపు బట్టీల సెంటర్‌లోని గుంటూరు బాపనయ్య నగర్‌లో నిర్మించనున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యాలయ భవనం కోసం రచయిత కె దేవేంద్ర శుక్రవారం నాడు రూ.లక్ష విరాళం ప్రకటించారు. దేవేంద్ర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజానాట్యమండలి నాయకులుగా కళా సేవలందించారు. విజయవాడ ఎంబివికెలో శుక్రవారం 'ప్రజా సంస్కృతి రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ సందర్భంగా రూ.లక్ష మొత్తాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రజానాట్యమండలి బాధ్యులకు దేవేంద్ర అందజేశారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డికి ఈ మొత్తాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా కళారూపాల సృష్టికి ప్రజానాట్యమండలి కార్యాలయం కేంద్రంగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు. భూరి విరాళం అందజేసిన దేవేంద్రకు పలువురు సాహితీ, సాంస్కృతిక కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ, ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇక్కడే పట్టెయ్యాలి..

- నేడు ఆస్ట్రేలియా మహిళలతో రెండో టి20 తలపడనున్న భారత్
- రాత్రి 7.00గం॥లకు



ముంబయి: తొలి టి20లో ఘన విజయం సాధించిన భారత మహిళల జట్టు ఇక సిరీస్‌పై కన్నేసింది. మూడు టి20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి టి20లో భారత్ 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఆస్ట్రేలియా మహిళల నిర్దేశించిన 142పరుగుల లక్ష్యాన్ని భారత్ 17.4ఓవర్లలో స్మృతి మంధాన వికెట్ కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. వన్డే సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన భారత మహిళలకు ఈ విజయం ఫుల్ జోష్ నింపింది. పేసర్ టిటాస్ సద్ధుకి తోడు దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ ఆస్ట్రేలియా మహిళలను కట్టడి చేసిన అత్యద్భుతం. ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన భారత మహిళల జట్టు ఆ తర్వాత జరిగిన వన్డే సిరీస్‌ను కోల్పోయింది. అయినా తొలి టి20లోనే టాప్‌సీడ్ ఆస్ట్రేలియాను చిత్తుచేసిన తీరు అత్యద్భుతం. ఇక ఆసీస్ జట్టులో అనుభవజ్ఞుడైన ఎల్లీస్ ఫెర్రీకి ఇది 300వ అంతర్జాతీయ మ్యాచ్. దీంతో ఆస్ట్రేలియా జట్టు ఈ మ్యాచ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు సిరీస్‌ను చేజారకుండా చూసేందుకు ప్రయత్నించే ఛాన్స్ ఉంది.

జట్లు(అంచనా)..

ఇండియా : హర్మన్‌ప్రీత్(కెప్టెన్), స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, దీప్తి శర్మ, యాస్టికా భాటియా, రీచా ఘోష్, అమన్‌జ్యోత్ కౌర్, శ్రేయాంక పాటిల్, రేణుక, టిటాస్ సద్ధు, పూజ వస్త్రాకర్/కనిక అహూజా

ఆస్ట్రేలియా: ఎలీసా హీలీ(కెప్టెన్), బ్రౌన్, గార్డినర్, కిమ్ గ్రాత్, కింగ్, లిచ్‌ఫీల్డ్, తహియా మెక్‌గ్రాత్, బెత్ మూనీ, ఎలీసా ఫెర్రీ, మెఘన్ స్కట్, సథర్లాండ్/వారేహామ్.

జద్రాన్‌కు పగ్గాలు

- చోటు దక్కించుకున్న ముజీబ్, నవీన్
- భారత్‌తో టి20 సిరీస్‌కు ఆఫ్ఘన్ జట్టు ఇదే!



కాబూల్: భారత పర్యటనకు వచ్చే ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు కెప్టెన్‌గా ఇబ్రహీమ్ జద్రాన్ ఎంపికయ్యాడు. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు శనివారం ఓ ప్రకటనలో ఈ విషయా న్ని వెల్లడించింది. బోర్డు ప్రకటించిన 19మంది ఆటగాళ్లతో కూడిన ఆఫ్ఘన్ జట్టు ఈనెల 11నుంచి భారత్‌తో టి20 సిరీస్‌లో ఆడనుంది. తొలి టి20 11న మొహాలీ వేదికగా జరగనుంది. గాయం నుంచి కోలుకున్న స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ కూడా జట్టులో చోటు దక్కించుకొన్నాడు. భారత పర్యటనకు వచ్చే ఆఫ్ఘనిస్తాన్ జట్టు మూడు టి20ల సిరీస్‌లో తలపడనుంది. జద్రాన్ సారథ్యంలో ఆఫ్ఘన్ జట్టు ఇటీవల యుఎఇ పర్యటనకు వెళ్లి 2-1తో టి20 సిరీస్‌ను చేజిక్కించుకొంది. స్టాండ్‌బై వికెట్ కీపర్‌గా ఇక్రమ్ అలిఖిల్ జట్టులో చోటు దక్కించుకొన్నాడని ఎసిబి చైర్మన్ మిర్‌వైల్ అష్రాఫ్ ఆ ప్రకటనలో తెలిపాడు.

జట్టు: జద్రాన్(కెప్టెన్), గుర్బాజ్, అలిఖిల్(వికెట్ కీపర్లు), జజాయ్, రామత్ షా, నజీబుల్లా, మహ్మద్ నబి, కరీమ్ , ఒమర్జాయ్, షరాఫుద్దీన్, ముజీబ్, ఫారూఖీ, ఫరీద్, నవీన్, నూర్ అహ్మద్, సలీమ్, ఖ్వీస్ అహ్మద్, గులాబుద్దిన్, రషీద్

ఆంధ్ర 119/3

బెంగాల్ 409ఆలౌట్ • రంజీట్రోఫీ-2024



విశాఖపట్నం: బెంగాల్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ -2024లో ఆంధ్ర జట్టు రెండోరోజు చివర్లో తడబడింది. దీంతో శనివారం ఆట నిలిచే సమయానికి ఆంధ్ర 3వికెట్ల నష్టానికి 119పరుగులు చేసింది. ఓపెనర్లు జ్ఞానేశ్వర్, ప్రశాంత్‌కుమార్ కలిసి తొలి వికెట్‌కు 64పరుగులు జతచేశారు. ఈ క్రమంలోజ్ఞానేశ్వర్(33)ను ప్రదీప్ ప్రమాణిక్ ఔట్ చేయడంతో ఆంధ్ర తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ప్రశాంత్ కుమార్(41), రషీద్(32) కలిసి 2వ వికెట్‌కు 48పరుగులు జతచేశారు. మరికొద్ది సేపట్లో రెండోరోజు ఆట ముగుస్తుందనగా ప్రశాంత్, రషీద్ ఔట్ కావడంతో ఆంధ్ర భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. రెండోరోజు ఆట నిలిచే సమయానికి కెప్టెన్ హనుమ విహారి(6) క్రీజ్‌లో ఉన్నాడు. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 289పరుగులతో రెండోరోజు ఆటను కొనసాగించిన బెంగాల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 409పరుగులకు ఆలౌటైంది. బెంగాల్ క్రీడామంత్రి మనోజ్ తివారి(32), వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్(70) అర్ధసెంచరీతో ఆదుకున్నారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ త్వరగా పెవీలియన్‌కు చేరడంతో బెంగాల్ జట్టు 126.2ఓవర్లలో 409పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లు లలిత్ మోహన్‌కు నాలుగు, శశికాంత్, నితీశ్ కుమార్, షోయబ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

మూడోటెస్ట్‌లో పాక్‌పై 8వికెట్ల తేడాతో గెలుపు



సిడ్నీ: పాకిస్తాన్‌తో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది. మూడో, చివరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు 8వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తుచేసింది. ఓవర్ నైట్ స్కోర్ 7వికెట్ల నష్టానికి 67పరుగులతో నాల్గోరోజు ఆటను కొనసాగించిన పాకిస్తాన్ జట్టు 115పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆస్ట్రేలియా జట్టు 130పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి రాగా.. ఖవాజా(0), వార్నర్(57)వికెట్లు కోల్పోయి ఛేదించింది. లబూషేన్(62) అర్ధసెంచరీతో మెరిసాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అమీర్ జమాల్‌కు లభించగా.. సిరీస్ పాట్ కమిన్స్‌కు దక్కింది. ఈ గెలుపుతో డబ్ల్యుటిసి పట్టికలోనూ ఆస్ట్రేలియా అగ్రస్థానానికి ఎగబాకింది.

టెస్టుల ఆఖరి ఇన్నింగ్స్ ఆడిన వార్నర్...

ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ డేవిడ్ వార్నర్ కెరీర్ ఆఖరి టెస్ట్ ఆఖరి ఇన్నింగ్స్ శనివారం ఆడేశారు. పాకిస్తాన్ నిర్దేశించిన 130పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓపెనర్‌గా దిగిన వార్నర్ 57పరుగులతో రాణించాడు. 75బంతులను ఎదుర్కొన్న వార్నర్ 7ఫోర్ల సాయంతో ఈ పరుగులు చేశాడు. 112టెస్టుల్లో వార్నర్ 44.6 స్ట్రయిక్‌రేట్‌తో 8,786పరుగులు చేశాడు. ఇందులో 37అర్ధసెంచరీలు, 26సెంచరీలతోపాటు మూడు డబుల్ సెంచరీలున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68